

నేటి సంచికతో
ఎడ్యుకేషన్ స్పెషల్ -2025
అందుకోండి

# నెరవేరనున్న క్రీడాకారుల కల

## మంచిర్యాలలో స్పోర్ట్స్ క్లబ్ ఏర్పాటు

- కేంద్ర, రాష్ట్ర సహకారాలతో ఏర్పాటు
- రూ. 30 కోట్లతో ఇండోర్ స్టేడియం నిర్మాణం
- దశాబ్దాల అనంతరం ఎట్టకేలకు మోక్షం
- 12 ఎకరాల స్థలం కేటాయింపు
- త్వరలో పనులు ప్రారంభించేందుకు సన్నాహాలు



మంచిర్యాల, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలో ఎప్పుడెప్పుడు స్టేడియం నిర్మాణానికి మోక్షం కలుగుతుందోనని దశాబ్దాలుగా ఎదురు చూస్తున్న క్రీడాకారులకు ఎట్టకేలకు ఆ కల నెరవేరే సమయం ఆసన్నమైంది. స్థానిక ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేంసాగర్‌రావు ప్రత్యేక చొరవతో స్టేడియం నిర్మాణానికి ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. ఈ మేరకు తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేనారెడ్డి, కలెక్టర్ కుమార్ దీపక్ స్థలాన్ని పరిశీలించి స్టేడియం నిర్మాణానికి సంసిద్ధత వ్యక్తం చేశారు. దీంతో స్టేడియం నిర్మాణానికి మోక్షం కలుగగా, త్వరలో పనులు ప్రారంభించేందుకు అధికార యంత్రాంగం సన్నాహాలు చేస్తోంది.



స్థల పరిశీలన జరుపుతున్న స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్, ఎమ్మెల్యే, జిల్లా కలెక్టర్ (ఫైల్)

### ఏళ్లుగా ఎదురు చూపులే..

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోనే మంచిర్యాలలో క్రీడలకు అత్యంత ప్రాధాన్యత ఉంది. ఇక్కడ సుమారు 3 వేల పైచిలుకు వివిధ రకాల క్రీడాకారులు ఉన్నారు. వారితోపాటు ఎన్‌సీసీ కెడెట్లు కూడా వందల సంఖ్యలో ఉంటారు. వీరందరికీ అనువైన క్రీడా స్థలంలో అందుబాటులో లేకపోవడంతో ఇన్నాళ్లుగా ఇబ్బందులు పడుతున్నారు. స్టేడియం అందుబాటులో లేని కారణంగా వివిధ క్రీడల్లో ప్రతిభ కనబరిచే అవకాశం క్రీడాకారులకు ఉండేదికాదు. ఎన్‌సీసీ కెడెట్లు పరేడ్ కోసం సుమారు 150 కిలో మీటర్ల దూరంలో ఉన్న ఆదిలాబాద్‌కు వెళ్లాల్సి వచ్చేది. 2016లో మంచిర్యాల జిల్లాగా ఆవిర్భంచినప్పటికీ స్టేడియం ఏర్పాటు మాత్రం కాలేదు. గతంలో స్థానిక జడ్పీ బాలుర ఉన్నత పాఠశాల మైదానంలో మినీ స్టేడియం నిర్మించాలని తలపెట్టినా...ఆ పనులు ముందుకు సాగలేదు. సదరు స్థలం పాఠశాలకు చెందినది కావడంతో పలువురి నుంచి అభ్యంతరాలు వ్యక్తమయ్యాయి. ఉన్న ఒక్కగానొక్క స్కూల్ గ్రౌండ్‌ను స్టేడియం నిర్మాణానికి కేటాయిస్తే, సాయంత్రం వేళల్లో విద్యార్థులు ఆటలాడుకునేందుకు అడ్డంకులు ఏర్పడతాయన్న ఉద్దేశ్యంతో పలు విద్యార్థి సంఘాల నేతలతోపాటు సామాజిక కార్యకర్తలు పలువురు పనులను అడ్డుకున్నారు. దీంతో స్టేడియం నిర్మాణం అర్థాంతరంగా రద్దు కాగా, సుమారు రూ. 2.5 కోట్లు మంజూరైన నిధులు వెనక్కి వెళ్లిపోయాయి. అప్పటి నుంచి పలు చోట్ల స్థల పరిశీలన జరిపినప్పటికీ కార్యరూపం దాల్చలేదు. రాళ్లవాగును ఆనుకొని పాత మంచిర్యాలలో 22 ఎకరాల ప్రభుత్వ స్థలాన్ని ఒక దశలో స్టేడియం నిర్మాణానికి కేటాయిస్తారనే ప్రచారం జరిగింది. అదికూడా ముందుకు సాగలేదు. దీంతో క్రీడాకారుల...

(తరువాయి 3లో)

## అవార్డు అందుకున్న రెడ్‌క్రాస్ సొసైటీ సభ్యులు



గవర్నర్ చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న మధుసూదన్‌రెడ్డి

మంచిర్యాల కలెక్టరేట్, జూన్ 14 (ఆంధ్రజ్యోతి):ప్రపంచ రక్తదాతల దినోత్సవాన్ని పురస్కరించుకుని ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ తెలంగాణ రాష్ట్ర శాఖ ఆధ్వర్యంలో శనివారం హైద్రాబాద్‌లోని రాజ్‌భవన్ సంస్కృతి కమ్యూనిటీ హాలులో నిర్వహించిన కార్యక్రమంలో మంచిర్యాల రెడ్‌క్రాస్ సొసైటీ సభ్యులు రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ చేతుల మీదుగా అవార్డు అందుకున్నారు. రక్తదాన శిబిరాలు నిర్వహించడం, మంచిర్యాల రక్తనిధి కేంద్రం ద్వారా అత్యధిక రక్త నిల్వలు సేకరించడంలో రెండవ స్థానంలో నిలవడంతో మంచిర్యాల ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీకి అవార్డు వచ్చింది. అవార్డును రెడ్‌క్రాస్ సొసైటీ ప్రతినిధి మధుసూదన్‌రెడ్డి, సభ్యులు గవర్నర్ చేతుల మీదుగా అందుకున్నారు. వార్డు రావడం పట్ల ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా చైర్మన్ కంకణాల భాస్కర్‌రెడ్డి ఆనందం వ్యక్తం చేశారు.

## రిజర్వేషన్‌లు అమలు చేశాకే ఎన్నికలు నిర్వహించాలి



మోకాళ్లపై కూర్చొని నిరసన వ్యక్తం చేస్తున్న బీసీ నాయకులు

మంచిర్యాల కలెక్టరేట్, జూన్ 14 (ఆంధ్రజ్యోతి):42 శాతం రిజర్వే షన్‌లు అమలు చేశాకే ఎన్నికలు నిర్వహించాలని జాతీయ బీసీ హక్కుల పోరాట సమితి నాయకులు పేర్కొన్నారు. శనివారం మంచిర్యాల పట్టణంలోని ఐబీ చౌరస్తాలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద మోకాళ్లపై నిల్చుని నిరసన వ్యక్తం చేశారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా కామారెడ్డి జిల్లాలో జరిగిన బీసీ డిక్లరేషన్ సభలో అధికారంలోకి వస్తే రిజర్వేషన్ కల్పిస్తామని చెప్పిన ప్రభుత్వం జూలై లేదా ఆగస్టులో ఎన్నికలు నిర్వహిస్తామని ప్రకట నలు చేయడాన్ని ఖండిస్తున్నామన్నారు. ఇది బీసీలను నమ్మించి మోసం చేయడమేనన్నారు. స్థానిక సంస్థల రిజర్వేషన్‌లు పెంచుకునే అధికారం ఆయా రాష్ట్రాలకు ఉందని అయినా ప్రభుత్వం ఆ దిశగా అడుగులు వేయకపోవడం బీసీలపై వివక్ష చూపడమేనన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు గుమ్ముల శ్రీనివాస్, నాయకులు తుల మధుసూదన్, లచ్చన్న, భీమ్‌సేన్, వెంకటయ్య, నర్సయ్య, బిక్షపతి, అంజన్న, అశోక్, లింగయ్య పాల్గొన్నారు.

## ఎఫ్‌డీవోగా రామ్మోహన్



జన్నారం, జూన్ 14 (ఆంధ్ర జ్యోతి): కవ్వాల్ టైగర్‌జోన్‌లోని జన్నారం అటవీ డివిజన్ ఎఫ్‌డీవోగా ఎం. రామ్మోహన్‌ను నియమిస్తూ అటవీ శాఖ ముఖ్య కార్యదర్శి సువర్ణ ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం రామ్మోహన్ హైదరాబాద్‌లోని దూలపల్లి అటవీ శిక్షణ అకాడమిలో రేంజ్ అధికారిగా, కోర్సు డైరెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా పది మంది సీనియర్ రేంజ్ అధికారులకు ప్రభుత్వం పదోన్నతి కల్పించడంలో భాగంగా రామ్మోహన్‌ను జన్నారం ఎఫ్‌డీవోగా బదిలీ చేశారు. గతంలో ఎఫ్‌డీవోగా విధులు నిర్వహించిన ఎస్. మాధవరావును 2003 అక్టోబర్‌లో హైదరాబాద్‌కు బదిలీ చేయగా 20 నెలలుగా మంచిర్యాల డీఎఫ్‌వో శివ ఆశీశ్‌సింగ్‌కు జన్నారం ఎఫ్‌డీవోగా అదనపు బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ఇప్పటికీ 20 నెలల తరువాత రెగ్యులర్ ఎఫ్‌డీవోగా రామ్మోహన్ బాధ్యతలు స్వీకరించనున్నారు.

## నేడు సీపీఐ 3వ మహాసభ

### చాడ వెంకటరెడ్డి రాక

నస్పూర్, జూన్ 14 (ఆంధ్రజ్యోతి) : భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) నస్పూర్ మండల మూడవ మహాసభ ఆదివారం స్థానిక నర్సయ్య భవన్‌లో జరుగుతుందని సీపీఐ మండల కార్యదర్శి జోగుల మల్లయ్య, ఆహ్వాన కమిటీ అధ్యక్షుడు మేకల దాసులు ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటలకు గోదావరి కాలనీ షిర్కే చౌరస్తా నుంచి నర్సయ్య భవన్ వరకు ర్యాలీ ఉంటుందన్నారు. ఈ మహాసభకు అధితులుగా సీపీఐ జాతీయ కార్యదర్శి వర్గ సభ్యుడు చాడ వెంకటరెడ్డితో పాటు రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు కలవేన శంకర్, వాసిరెడ్డి సీతారామయ్య, జిల్లా కార్యదర్శి రామడుగు లక్ష్మన్‌లు హాజరు అవుతున్నారన్నారు. సీపీఐ, యూనియన్, అనుబంధ సంఘాల నాయకులు సభకు హాజరై విజయవంతం చేయాలని వారు కోరారు.

## శ్రీరాంపూర్ ఓసీపీ పీఓ బదిలీ

శ్రీరాంపూర్,జూన్14 (ఆంధ్రజ్యోతి): శ్రీరాంపూర్ ఉపరితలగని ప్రాజెక్టు అధికారిగా పని చేస్తున్న టి. శ్రీనివాస్ హైదరాబాద్‌లోని మార్కెటింగ్ విభాగానికి బదిలీ అయ్యారు. ఈ మేరకు అధికారుల నుంచి ఉత్తర్వులు వెలువడ్డాయి. గతంలో అదే విభాగంలో డిజీఎంగా పని చేసిన ఆయన ప్రస్తుతం జీఎం(మార్కెటింగ్)గా పదోన్నతి పై వెళ్లనున్నారు. ప్రస్తుతం జీఎం(మార్కె టింగ్)గా ఉన్న రాజశేఖరరావు ఈ నెల ఆఖరులో రిటైర్ కానున్నారు.

## మంత్రికి వెండి కిరీటం బహూకరణ

చెన్నూరు, జూన్ 14 (ఆంధ్రజ్యోతి) : మంత్రి పదవీ చేపట్టి మొదటిసారి చెన్నూరు పర్యటనకు మంత్రి హోదాలో వచ్చిన గడ్డం వివేక్‌వెంకటస్వామికి కాంగ్రెస్ పార్టీ నాయకులు వెండి కిరీటం బహూకరించారు. శనివారం రాత్రి ఎమ్మెల్యే కార్యాలయంలో మంత్రికి నాయకుడు హేమంతరెడ్డి దంపతులు వెండికిరీటం తొడిగి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# కొత్త గనుల ఏర్పాటుకు కృషి చేస్తా

నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పిస్తా

రాష్ట్ర వ్యాప్తంగా ఇసుక అక్రమ రవాణాకు చెక్

చెన్నూరులో మంత్రి వివేక్‌వెంకటస్వామి



చెన్నూరులో కార్నర్ మీటింగ్‌లో మాట్లాడుతున్న మంత్రి వివేక్‌వెంకటస్వామి

చెన్నూరు, జూన్ 14 (ఆంధ్రజ్యోతి) : ఈ ప్రాంతం అభివృద్ధికి సింగరేణి కొత్త గనులను ఏర్పాటు చేస్తానని దీంతో నిరుద్యోగ యు వతకు ఉపాధి అవకాశాలు మెండుగా లభిస్తాయని మంత్రి వివేక్‌వెంకటస్వామి అన్నారు. మంత్రి పదవీ చేపట్టాక మొదటిసారి ఆయన శనివారం చెన్నూరు పట్టణానికి వచ్చిన సందర్భంగా ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు మంత్రికి ఘన స్వాగతం పలికారు. జలాల్ పెట్రోల్ బంక్ నుంచి పాత బస్టాండ్ వద్ద ఏర్పాటు చేసిన సభాస్థలి వద్దకు ర్యాలీ చేపట్టి మంత్రికి స్వాగతం పలికారు. పాత బస్టాండ్‌లో ఏర్పాటు చేసిన కార్నర్ మీటింగ్‌లో మంత్రి మాట్లాడారు. ఈ ప్రాంతంలో కొత్త గనుల ఏర్పాటుకు కృషి చేస్తానని దీని ద్వారా ఉపాధి అవకాశాలతో పాటు సింగరేణి డీఎం ఎఫ్‌టీ నిధులతో రోడ్లు, రహదారుల నిర్మాణం సాగుతుందన్నారు. తెలంగాణ వ్యాప్తంగా అక్రమ ఇసుక రవాణాపై ఉక్కు పాదం మోపుతామని తద్వారా ప్రభుత్వానికి ఆదాయం పెంచడమే తన లక్ష్యమన్నారు. నియోజకవర్గానికి నిధుల వరద పారిస్తూ రాష్ట్రంలోనే చెన్నూరు నియోజకవర్గాన్ని ఒక మోడల్‌గా తీర్చిదిద్దుతామన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు వల్ల ఒనగూరిన ప్రయోజనం ఏమిలేదని, తన తండ్రి కాకా వెంకటస్వామి ప్రాణహిత చేవెళ్ల ప్రాజెక్టు కోసం రూ. 1100 కోట్లు మంజూరు చేయించి పనులను ప్రారంభిస్తే బీఆర్‌ఎస్ ప్రభుత్వం కమీషన్ల కోసం ఆ స్థలంలో కాకుండా డిజైన్ మార్చి కాళేశ్వరం వద్ద నిర్మించారన్నారు. అమృత్ ఫ ల్ 02 పథకం కింద తాగునీరు అందించేందుకు రూ. 30 కోట్లు మంజూరు చే యించానని, మరో రూ. 40 కోట్ల నిధులతో గోదావరి నీటిని నియోజకవర్గ ప్రజలకు అందిస్తానని హామీ ఇచ్చారు. పోడుభూములు సాగు చేసుకుంటున్న రైతులను అటవీ శాఖ అధికారులు ఇబ్బందులు పెడితే సహించేది లేదన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంఎల్‌సీ పురాణం సతీష్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

●మంత్రి వివేక్ పర్యటన సందర్భంగా పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. జైపూర్ ఏసీపీ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో పోలీసులు భారీ బందోబస్తు నిర్వహించగా ఎలాంటి అవాంచనీయ సంఘటనలు జరగకుండా నిఘా పెట్టారు.

●ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మంత్రి మంత్రి వివేక్ వెంకటస్వామి పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు. మంచిర్యాల డీసీపీ భాస్కర్, జైపూర్ ఏసీపీ వెంకటేశ్వర్లు, సీఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.

### మంత్రినైనా మీ సేవకుడిగా పని చేస్తా

మందమర్రి టౌన్ : రాష్ట్ర మంత్రి అయినా సేవ కుడిగా పని చేస్తానని రాష్ట్ర కార్మిక, ఉపాధి కల్పన, గనుల శాఖ మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి అన్నారు. శనివారం రాత్రి స్థానిక మార్కెట్ సెంటర్‌లో నిర్వహిం చిన సభలో ఆయన ప్రజలను ఉద్దేశించి మాట్లాడారు. తాను ఎల్లప్పుడు నియోజక వర్గంలో అందుబాటులో ఉంటూ అభివృద్ధికి పెద్దపీట వేస్తానని పేర్కొన్నారు. తనకు మంత్రి పదవి రాకుండా ఎన్నో కుట్రలు చేశారని, అయినా నీతినిజాయితీ, పని తీరు దృష్టిలో పెట్టుకొని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పదవి కట్ట బెట్టారని, తన తండ్రి నుంచి ఆనవాయితీగా వస్తుందని, తనకు ఈ పదవి రావడం ఆనం దంగా ఉందన్నారు. నియోజకవర్గంలో సాండ్ మాఫియా, భూ దందాలు అన్ని ఇప్పటికే బంద్ చేయించానని చెప్పారు. పార్టీ అభివృద్ధికి పాటుపడే కార్యకర్తలకు పెద్దపీట వేస్తానని అన్నారు. పాలక వర్గం లేని మందమర్రి మున్సిపాలిటీకి ఎన్నికలు జరిపిస్తానని తెలిపారు. రాష్ట్ర మంత్రిగా, ప్రభుత్వం పథకాలు అమలు అయ్యే విధంగా చూస్తామన్నారు. పథకాలు అర్హులకు అందేలా చర్యలు చేపడ తామని తెలిపారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. అంతకు ముందు అంబేద్కర్ విగ్రహానికి పూల మాల వేసి నివాలులర్పించారు. పార్టీ నాయకులు క్రేన్‌తో గజ మాలతో సత్కరించారు.



మందమర్రిలో మాట్లాడుతున్న మంత్రి వివేక్ వెంకటస్వామి

# గణపతి ఆలయంలో చతుర్థి పూజలు

నస్పూర్, జూన్ 14 (ఆంధ్రజ్యోతి) : నస్పూర్ పట్టణం హౌసింగ్ బోర్డు కాలనీలోని లక్ష్మి గణపతి దేవాలయంలో శనివారం సంకట హర చతుర్థిని పురస్కరించుకుని స్వామి వారికి 108 కిలోల ఎం డు ద్రాక్ష పండ్లతో అభిషేకం ఘనంగా నిర్వ హిం చారు. దేవాలయ ప్రధానార్చకులు గంగారపు వంశీ కృష్ణ శర్మ ఆధ్వర్యంలో ఉదయం ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం స్వామికి అభిషేకం వై భవంగా జరిపారు. భక్తులకు అన్ని ఏర్పాట్లు చేసి నట్లు ఆలయ కమిటీ అధ్యక్షుడు రఘుపతిరావు తె లిపారు. అనంతరం పుర వీధుల్లో పల్లకీ సేవ, నూతనంగా నిర్మించిన మండపంలో భక్తుల చంద్ర దర్శనం తర్వాత అన్నదానం కార్యక్రమాన్ని నిర్వహించారు.



స్వామివారికి హారతి ఇస్తున్న పూజారి వంశీకృష్ణ శర్మ పాల్గొన్న భక్తులు

### రైలు కింద పడి గుర్తుతెలియని వ్యక్తి మృతి

మంచిర్యాలక్రైం, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): రైలు కింద పడి గుర్తు తెలియని వ్యక్తి(35) మృతి చెందినట్లు రైల్వే ఎస్ఐ మహేందర్ ఒక ప్రకటనలో తెలిపారు. శుక్రవారం రవీంద్రఖని మంచిర్యాల రైల్వే స్టేషన్ మధ్యలో గుర్తు తెలియని వ్యక్తి రైలు కింద పడి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతదేహాన్ని ప్రభుత్వ ఆసుపత్రి మార్చురీలో భద్రపరిచారు. పూర్తివివరాల కోసం 9701112343 సంప్రదించాలని కోరారు.

### దివ్యాంగులు ఉపకరణాల కోసం దరఖాస్తులు చేసుకోవాలి

మంచిర్యాల కలెక్టరేట్, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): అర్హులైన దివ్యాంగులు ఉపకరణాల కోసం దరఖాస్తులు చేసుకోవాలని జిల్లా మహిళ శిశు దివ్యాంగులు వయో వృద్ధుల సంక్షేమ శాఖ అధికారి రౌఫ్‌ఖాన్ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వం వికలాంగుల సహాయ సమితి ద్వారా జిల్లాలోని ప్రతీ దివ్యాంగుడికి సహాయ ఉపకరణాలు పంపిణీ చేస్తుందన్నారు. జిల్లాకు 45 రెట్రో ఫిట్‌మెంట్ స్కూటీలు, 14 బ్యాటరీ వీల్ చైర్లు, 18 మొబైల్ బిజినెస్ బ్యాటరీ ట్రై సైకిళ్లు, 1 బ్యాటరీ మిని ట్రేడింగ్ ఆటో వెహికల్, ఐదు హైబ్రీడ్ వీల్‌చైర్‌లు, 14 ల్యాప్ టాప్ (డిగ్రీ విద్యార్థులకు), 7 లాప్ ట్యాప్ (ఉన్నత సాంకేతిక విద్య), 22 టాబ్స్, 11 చేతి కర్రలు, 3 వీల్‌చైర్‌లు, 1 చెవిటి మిషన్, 6 ట్రైసైకిళ్లు, 6 వీల్‌చైర్‌లు, 23 క్రచెస్, 2 చెవిటి మిషన్, 23 వాకింగ్ స్టిక్స్, 11స్మార్ట్ కేన్స్, 11 ఎంసీఆర్ చెప్పల్ మంజూరయ్యాయని తెలిపారు. 18లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలన్నారు.



# క్రీడా పాఠశాలల్లో ప్రవేశాలకు ఆహ్వానం

- రేపటి నుంచి ఎంపిక పోటీలు
- నాలుగో తరగతి నుంచే క్రీడల్లో తర్ఫీదు
- అంతర్జాతీయ స్థాయికి ఎదిగే అవకాశం

**ఎంపిక విధానం..**

మొత్తం 60 మంది బాలురు, 60 బాలికలకు అవకాశం కల్పిస్తారు. హకీంపేట, కరీంగనర్, అదిలాబాద్ స్కూల్‌లో 20 మంది బాలురు, 20 మంది బాలికల చొప్పున అవకాశం ఉంటుంది. దొడ్డు కాల్లు, ప్లాటీ ఫీట్, వెన్నెముక వంగి ఉన్నవారు, గుండె సంబంధిత జబ్బులు ఉన్న వారు, ఎముకలు విరిగినవారు అనర్హులు. ఎంపికైన వారికి అథ్లెటిక్స్, ఆర్చరీ, ఫుట్‌బాల్, జిమ్నాస్టిక్స్, రోయింగ్, వాలీబాల్, జూడో, ఫెన్సింగ్, వెయిట్ లిఫ్టింగ్, బాక్సింగ్, రెజ్లింగ్ క్రీడాంశాల్లో శిక్షణ ఇస్తారు. రాష్ట్ర జాతీయ స్థాయిలో రాణించిన వారికి భవిష్యత్‌లో రైల్వే, ఆర్మీ, నేవి, ఎయిర్ ఫోర్స్, పోలీస్, బ్యాంక్, పోస్టల్ డిపార్ట్ మెంట్, పీఈటీ, పీడీ, కోచ్‌లు, కార్పోరేట్ సెక్టర్‌లో మంచి ఉద్యోగ ఉపాధి అవకాశాలు లభిస్తాయి.

ఆసిఫాబాద్‌రూరల్, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): విద్యార్థిగా, క్రీడాకారుడిగా రాణించాలనుకునే వారికి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం సువర్ణావకాశం కల్పిస్తోంది. నాలుగో తరగతి నుంచి క్రీడారంగంలో తర్ఫీదు పొందేందుకు క్రీడలశాఖ కసరత్తు చేస్తోంది. రాష్ట్రంలోని మూడు స్పోర్ట్స్ స్కూల్‌లో 2025-26 ఏడాదిలో 4వ తరగతిలో ప్రవేశాలకు నోటిఫికేషన్ విడుదల చేసింది. స్పోర్ట్స్ స్కూల్‌లో చోటు దక్కితే క్రీడల్లో అంతర్జాతీయ స్థాయికి ఎదిగే అవకాశం ఉంటుందని పలువురు నిపుణులు పేర్కొంటున్నారు.

**రాష్ట్రంలో మూడు క్రీడా పాఠశాలలు..**

రాష్ట్రంలోని మూడు ప్రాంతీయ క్రీడాపాఠశాలల్లో 2025-26 విద్యా సంవత్సరంలో నాలుగో తరగతిలో ప్రవేశాలకు ఎంపిక పోటీల తేదీలను క్రీడాశాఖ అధికారులు ప్రకటించారు. జూన్ 16 నుంచి 19వ తేదీ లోపు మండల స్థాయిలో, 23 నుంచి 26 వరకు జిల్లా స్థాయిలో జులై 1 నుంచి 5వ తేది వరకు రాష్ట్ర స్థాయిలో ఎంపిక పోటీలు జరుగుతాయి. సికింద్రాబాద్‌లోని హకీంపేట, కరీంగనర్, ఆదిలాబాద్ జిల్లాలో స్పోర్ట్స్ స్కూల్స్ ఉన్నాయి. విద్యార్థులకు కొన్ని శారీరక సామర్థ్యానికి సంబంధించిన పరీక్షలు నిర్వహించి ఎంపిక చేస్తారు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన వారికి నాలుగో తరగతిలో ప్రవేశం దక్కుతుంది.

**నిర్వహించే శరీర దారుఢ్య పరీక్షలు:**

మండల, జిల్లా స్థాయిలో ఎత్తు బరువు, 30 మీటర్ల ఫ్లైయింగ్ స్టార్ట్స్ స్టాండింగ్ బ్రాడ్ జంప్, 800 మీటర్ల రన్నింగ్, వర్టికల్ జంప్, 6, 10 మీటర్ల షటల్ రన్ మెడిసిన్ బాల్ త్రో టెస్టులు నిర్వహిస్తారు. రాష్ట్ర స్థాయిలో ఎత్తు బరువు, 30 మీటర్ల ఫ్లైయింగ్ స్టార్ట్, స్టాండింగ్ బ్రాడ్‌జంప్, 6, 10 మీటర్ల షటల్‌రన్ మెడిసిన్ బాల్ త్రో, స్టాండింగ్ వర్టికల్ జంప్, 800 మీటర్ల రన్నింగ్ నిర్వహిస్తారు. 4వ తరగతిలో ప్రవేశాలు పొందగలిగే విద్యార్థులు సెప్టెంబరు 1, 2016 నుంచి ఆగస్టు 30, 2017 మధ్య జన్మించి ఉండాలి. ఆధార్ కార్డు, పుట్టిన ధ్రువపత్రం తప్పనిసరి.

**సద్వినియోగం చేసుకోవాలి..**
**రమాదేవి, డీవైఎస్‌వో, ఆసిఫాబాద్**



క్రీడాకారులుగా ఎదగాలనే విద్యార్థులకు ఇది మంచి అవకాశం. తెలంగాణ స్పోర్ట్స్ స్కూల్‌లో చదివి అంతర్జాతీయ స్థాయితో పాటు ఒలింపిక్స్ వంటి మెగా అవెంట్‌లో పాల్గొని సత్తాచాటిన క్రీడాకారులు చాలా మంది ఉన్నారు. స్పోర్ట్స్ స్కూల్‌లో అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన శిక్షణ లభిస్తుంది. చిన్నారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొవాలి.

### భూ తగాదాతో ఇద్దరిపై దాడి



గాయపడిన ప్రభాకర్

దండేపల్లి జూన్ 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొండాపూర్‌లో ఇంటి పెరడు(భూతగాదా)విషయంలో రెండు కుటుంబాల మధ్య గొడవ జరిగింది. కొందరు వ్యక్తులు దాడి చేయగా ఇద్దరికి గాయాల య్యాయి. దండేపల్లి ఎస్సై తహసీనోద్దీన్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. కొండాపూర్ చెందిన భారధరపు సత్తవ్వ ఇంటి పక్కనే కొంత భూమి ఉంది. పక్కింటి బారధరపు కుమారస్వామి కుటుంబీకులతో గొడవలు జరుగుతున్నాయి. ఇదే క్రమంలో శనివారం పెరట్లో కుమార స్వామితో ఆయన కుటుంబసభ్యులు లింగయ్య, అమృత, గంగలక్ష్మి వచ్చి ఎడ్ల నాగలితో పెరడిని దున్నుతుండగా సత్తవ్వ వాళ్ల దగ్గరకు వచ్చి ఎందుకు దున్నుతున్నారని ప్రశ్నించింది. దీంతో వారు ఆమెపై ఇనుపరాడ్లు, గొడ్డలితో దాడి చేశారు. ఇది గమనించిన సత్తవ్వ మరిది ప్రభాకర్ గొడవను అపేందుకు వెళ్లగా అతనిపై మూకుమ్మడి దాడి చేశారు. ఈదాడిలో ప్రభాకర్ చేతులు, తలకు తీవ్ర గాయాలయ్యాయి. దీంతో ఇరుగుపొరుగు వారు రావడంతో వారు అక్కడి నుంచి వెళ్లిపోయారు. గాయపడిన ప్రభాకర్‌ను స్థానికులు 108లో లక్షెట్టిపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం మంచిర్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. భారధరపు సత్తవ్వ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు దండేపల్లి ఎస్సై తహసీనోద్దీన్ వెల్లడించారు.

### నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

ఆసిఫాబాద్‌రూరల్, జూన్ 14(ఆంధ్రజ్యోతి): జన్కపూర్‌లోని విద్యుత్ ఉప కేంద్రంలో నెలవారి మరమ్మతు పనుల్లో భాగంగా ఆదివారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేయడం జరుగుతుందని ఏఈ లక్ష్మీరాజం తెలిపారు. దీంతో పట్టణంలోని బ్రాహ్మణవాడ, రావువాడ, కంచుకోట, ఓల్డ్ పోస్టాఫీసు ఏరియా, సందీప్‌నగర్, నూర్‌నగర్, బజార్‌వాడీ, బాపునగర్, వివేకానంద చౌక్, జన్కాపూర్ అండ్ రామాలయం ఏరియా, కేబీ చౌక్, ఉస్మానియా మజీద్, దస్నాపూర్, హడ్కో కాలనీ, రెహ్మత్‌నగర్, జూబ్లీ మార్కెట్ మెయిన్ రోడ్డు, ఎన్‌జీవో కాలనీ, ఓల్డ్ రాజంపేట అండ్ న్యూ రాజంపేట, గుండి రోడ్డు, టీఆర్ నగర్, ఎక్స్‌ప్రెస్ జిన్నింగ్ మిల్లు లైన్, కలెక్టర్ ఆఫీస్ ఫీడర్‌లో విద్యుత్ అంతరాయం ఉంటుందన్నారు.

### మారిన విద్యుత్ శాఖాధికారుల ఫోన్ నంబర్లు

ఆసిఫాబాద్, జూన్ 14(ఆంధ్రజ్యోతి): ఆసిఫాబాద్ టౌన్ సెక్షన్‌కు సంబంధించి విద్యుత్ శాఖాధికారుల ఫోన్ నంబర్లు మారాయని ఆసిఫాబాద్ ఏఈ లక్ష్మీరాజం శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసిఫాబాద్ జిల్లా సూపరింటెండెంట్ ఇంజనీర్ (8712486502), ఆసిఫాబాద్ డివిజనల్ ఇంజనీర్ (8712486513, ఆసిఫాబాద్ టౌన్ సబ్‌డివిజనల్ ఇంజనీర్ ఏడీఈ(8712486503), ఆసి ఫాబాద్ సబ్‌స్టేషన్ (8712486517), ఆసిఫాబాద్ టౌన్ ఏఈ (8712486516), సబ్ ఇంజనీర్ (8712486522), ఫోర్‌మెన్ (8712486518), లైన్‌ఇన్స్‌పెక్టర్ (8712486519), లైన్‌మెన్ (8712486520), లైన్‌మెన్ (8712486521), బూర్గుడ సబ్‌స్టేషన్ (8712486526) నంబర్లు మారాయని వినియోగదారులు గమనించాలని ఏఈ సూచించారు.

### కుల, ఆదాయ ధ్రువీకరణపత్రాలు అందించాలి

ఆసిఫాబాద్, జూన్ 14(ఆంధ్రజ్యోతి): పాఠశాలలు ప్రారంభమైన నేపథ్యంలో విద్యార్థులకు పాఠశాలలో, కళాశాలల్లో, రైతులకు బ్యాంకు రుణాలు పొందడానికి కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు ప్రత్యేక భూమిక పోషిస్తాయని పత్రాలను తహసీల్దార్లు వెంటనే అందించాలని జాతీయ మానవహక్కుల కమిటీ జిల్లా చైర్మన్ రాథోడ్ రమేష్ ఒక ప్రకటనలో కోరారు. కుల, ఆదాయ పత్రాలు వెంటనే అందించక పోతే విద్యార్థులు ప్రవేశాలకు దూరమయ్యే అకాశం ఉందని ఈ విషయాన్ని దృష్టిలో పెట్టుకుని వెంటనే పత్రాలు ఇవ్వాలని కోరారు.

### గంజాయి పట్టివేత

నస్పూర్, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): నస్పూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని సీతారాంపల్లి రోడ్‌లో శనివారం సాయంత్రం పెట్రోలింగ్ చేస్తుండగా అనుమానాస్పదంగా కనిపించిన నాతరి వంశీని సోదా చేయగా 99 గ్రాముల గంజాయి దొరికిందని సీఐ ఆకుల అశోక్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. నస్పూర్ ఎస్సై ఉపేందర్‌రావు సిబ్బందితో పెట్రోలిం గ్ చేస్తుండగా వంశీ పట్టుబడ్డాడని, అతని వద్ద నుంచి గంజాయిని స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు తెలిపారు. వంశీ స్థానిక విద్యానగర్‌కు చెందిన వాడని తెలిపారు.

## లోక్ అదాలత్‌తో కేసుల పరిష్కారం

**లక్షెట్టిపేట జూనియర్ సివిల్ జడ్జి సాయికిరణ్**

లక్షెట్టిపేట, జూన్ 14(ఆంధ్రజ్యోతి): రాజీ మార్గమే రాజమార్గమని లక్షెట్టిపేట జూనియర్ సివిల్ జడ్జి సాయికిరణ్ కసమల అన్నారు. పట్టణ న్యాయస్థానంలో శనివారం న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు ఏర్పాటు చేసిన జాతీయ లోక్ అదాలత్‌లో ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. క్షణికావేశంలో ఒకరిపై ఒకరు కేసులు పెట్టుకుని కోర్టుల చుట్టు తిరుగుతూ విలువైన సమయాన్ని వృథా చేసుకోకూడదని న్యాయ సేవాధికార సంస్థ మంచి అవకాశాన్ని కల్పించిందని ఆ అవకాశమే లోక్ అదాలత్ అన్నారు. లోక్ ఆదాలత్‌లో తీర్పు అంతిమ తీర్పు అని లక్షెట్టిపేట న్యాయస్థానం పరిధిలో రాజీ పడిన పలు కేసులను పరిష్కరించారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కామిరెడ్డి సత్తన్న, ఏజీపీ సత్యం, లక్షెట్టిపేట, జన్నారం, దండేపల్లి, హాజీపూర్ ఎస్సైలు సురేష్, అనూష తహసీయోద్దీన్, స్వరూప్‌రాజ్, సీనియర్ న్యాయవాదులు రాజేశ్వర్‌రావు, భూంరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

**చెన్నూరు:** పెండింగ్‌లో ఉన్న కేసుల పరిష్కారం కోసమే నేషనల్ లోక్‌అదాలత్ నిర్వహిస్తున్నట్లు చెన్నూరు మున్సిఫ్ కోర్టు జూనియర్ సివిల్ జడ్జి పర్వతపు రవి అన్నారు. శనివారం కోర్టు ఆవరణలో ఏర్పాటు చేసిన నేషనల్ లోక్ అదాలత్ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. లోక్ అదాలత్‌లో మొత్తం కేసులు 1,458 కాగా 1,354 కేసులు పరిష్కారమయ్యాయని పేర్కొన్నారు. డ్రంకెన్‌డ్రైవ్ కేసుల్లో రూ. 6,36,420 జరిమానా విధించగా, బ్యాంకు ఇతర కేసుల్లో రూ. 23,96,813 వచ్చాయన్నారు. అలాగే 44 క్రిమినల్ కేసులు, నాలుగు సివిల్ కేసుల్లో రాజీ పడడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు, పోలీసులు, బ్యాంకుల అధికారులు పాల్గొన్నారు.




కేసును పరిష్కరిస్తున్న జూనియర్ సివిల్ జడ్జి సాయికిరణ్

## విచ్చలవిడిగా గంజాయి, మద్యం అమ్మకాలు

**- రోడ్డు ప్రమాదంలో మృతి చెందుతున్న యువకులు - ఆందోళనలో తల్లిదండ్రులు**



కాసిపేట, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దేవాపూర్‌లో యువత మద్యం, మత్తు పదార్థాలకు బానిసలై విలువైన జీవితాలను నాశనం చేసుకుంటున్నారు. మూడు పదుల వయస్సు నిండకుండానే కుమారులు రోడ్డు ప్రమాదాల్లో బలైపోతూ తల్లిదండ్రులకు తీరని దుఃఖాన్ని మిగిలిస్తు న్నారు. ఒక్క ఏడాదిలోనే నాలుగు రోడ్డు ప్రమాదాలు జరిగితే అందులో నలుగురు మృతి చెందగా ముగ్గురు గాయాలపా లయ్యారు. మద్యం మత్తులో యువత, బైక్ రేసింగ్‌లతో ప్రాణాల మీదకు తెచ్చుకుంటు న్నారు. ఇదిలా ఉండగా శనివారం మందమర్రికి చెందిన యువకులు దేవాపూర్‌కు వచ్చి దేవాపూర్ యువకులు పరస్పరం దాడులకు పాల్పడ్డారు. ఇందులో కొందరికి గాయాలు కాగా మళ్లీ మందమర్రి నుంచి 20 మంది యువకులు వచ్చి దేవాపూర్‌లో వీరంగం సృష్టించారు. బెల్ట్‌షాపుల్లో 24గంటలు మద్యం అందుటులో ఉండడంతో స్థానిక యువకులు మద్యా నికి బానిసలవుతున్నారు. మద్యం అమ్మకాలు కట్టడి చేయాలని స్థానికులు అధికారులను కోరినప్పటికి ఎవరు పట్టించుకోవడం లేదన్నారు. ఈ ఏడాదిలోనే మద్యం మత్తులో ముగ్గురు రోడ్డు ప్రమాదాల భారిన పడి మృతి చెందారు.

**విషాదం నింపుతున్న ప్రమాదాలు..**

రోడ్డు ప్రమాద ఘటనలు బాధిత కుటుంబాల్లో విషాదం నింపుతున్నాయి. లారీ యార్డులో చేదం తిరుపతి (23), గజాల భీమన్న దగ్గర రోడ్డు ప్రమాదంలో బైరి నరేశ్(26), టోకెన్ ఆఫీసు దగ్గర జరిగిన రోడ్డు ప్రమాదంలో వెంకటేశ్(25) అనే యువకులు మృతి చెందిన ఘటనలు మరువకముందే వారం రోజుల క్రితం మద్దిమాడ రోడ్డుపై బైరినేని అర్జున్(22) అనే యువకుడు బైక్ అదుపుతప్పి కిందపడి మృతి చెందాడు. రోడ్డు ప్రమాదాల బారినపడి యువకులు మృతి చెందడం తల్లిదండ్రుల్లో ఆందోళన నెలకొంది. ఇప్పటికైనా సంబంధిత శాఖ అధికారులు స్పందించి మద్యం, గంజాయి అమ్మకాలను నియంత్రించి, పిల్లలను కాపాడాలని స్థానిక తల్లిదండ్రులు కోరుతున్నారు.




### డైరెక్టర్‌గా గౌతమ్ పొట్రు బాధ్యతల స్వీకరణ



సీఎండీకి పుష్పగుచ్ఛం అందిస్తున్న డైరెక్టర్ గౌతమ్ పొట్రు

శ్రీరాంపూర్, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): సింగరేణి నూతన డైరెక్టర్(పర్సనల్ అడ్మినిస్ట్రేషన్ అండ్ వెల్ఫేర్-పా)గా గౌతమ్ పొట్రు నియమితులయ్యారు. ఈ మేరకు ఆయన శనివారం హైదరాబాద్‌లోని సింగరేణి భవన్‌లో బాధ్యతలు చేపట్టారు. అనంతరం సీఎండీ ఎన్ బలరాంను కలిసి పుష్పగుచ్ఛం అందించారు. ఆయనకు సీఎండీ శుభాకాంక్షలు తెలిపారు. అలాగే సంస్థ డైరెక్టర్లు సూర్యనారాయణ, వెంకటేశ్వర్లు, ఈడీ (కోల్‌మూమెంట్) సుభాని, జీఎం(మార్కెటింగ్) రాజశేఖర్‌రావు అభినందనలు తెలిపారు. ఇప్పటి వరకు డైరెక్టర్(ప్రాజెక్ట్స్ అండ్ ప్లానింగ్) వెంకటేశ్వర్లు డైరెక్టర్(పా)గా అదనపు బాధ్యతలు కలిగి ఉన్నారు. నూతనంగా ఐఏఎస్ అధికారి డైరెక్టర్ (పా)గా రావడంతో ఆయనకు బాధ్యతలు అప్పగించారు. అలాగే డైరెక్ట ర్(పా)గా ఐఏఎస్ అధికారికి బాధ్యతలు అప్పగించాలని కార్మికులు, యూనియన్ నాయకుల నుంచి ఇప్పటివరకు వస్తున్న డిమాండ్ గౌతమ్ పొట్రు నియామ కంతో పరిపూర్ణమైంది.

### సింగరేణిలో పర్సనల్ డిపార్టుమెంట్ కీలకం

మందమర్రి టౌన్, జూన్ 14(ఆంధ్రజ్యోతి): సింగరేణిలో పర్సనల్ డిపార్టుమెంట్ చాలా కీలకమని, కార్మికులకు సంబంధించిన సంక్షేమం, డేటా అంతా వారి వద్దనే ఉంటుందని మందమర్రి జీఎం దేవేందర్ తెలిపారు. స్థానిక జీఎం కార్యాలయంలో డీవైపీఎంగా పనిచేసిన సత్యబోస్ భూపాలపల్లికి, పర్సనల్ ఆఫీసర్ విశ్రాంత్ కుమార్ కొత్తగూడెం కార్పోరేట్‌కు బదిలీపై వెళ్తున్న సందర్భంగా శనివారం జీఎం కార్యాలయంలో ఆత్మీయ సన్మాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో డీవైపీఎం ఎండీ ఆసిఫ్, మాస్కుల కార్తిక్, సత్యనారాయణ, వంశీ, ఆఫీస్ ఓఎస్ రాజలింగు, పర్సనల్ డిపార్టుమెంట్ సిబ్బంది పాల్గొన్నారు.

### గాయపడిన కార్మికుడికి పరామర్శ

శ్రీరాంపూర్, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): ఎస్ఆర్‌పీ 3 గనిలో పనిచేస్తూ గాయపడిన కిరణ్ అనే కార్మికుడిని టీబీజీకేఎస్ రాష్ట్ర అధ్యక్షుడు ప్రధాన కార్యదర్శి కేతిరెడ్డి సురేందర్ రెడ్డి, కేంద్ర కార్యవర్గ సభ్యుడు గోపినాయక్ శనివారం పరామర్శించారు. రామకృష్ణాపూర్‌లోని ఏరియా ఆస్పత్రిలో కలిసి ధైర్యం చెప్పారు. కార్యక్రమంలో ఎస్ఆర్‌పీ 3 పిట్ కార్యదర్శి తీగల వెంకటరెడ్డి, సహాయ కార్యదర్శి నరేష్, చీఫ్ అడ్వైజర్ సాదుల భాస్కర్, ఇతర నాయకులు ఉన్నారు.

### పర్సనల్ మేనేజర్‌కు సన్మానం

రెబ్బెన, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): బెల్లంపల్లి ఏరియా జనరల్ మేనేజర్ కార్యాలయం నుంచి బదిలీపై వెళ్తున్న పర్సనల్ మేనేజర్ రెడ్డిమల్ల తిరుపతిని శనివారం సింగరేణి కోల్‌మైన్స్ లేబర్ యూనియన్ ఆధ్వర్యంలో సన్మానించారు. ఈ సందర్భంగా ఐఎన్‌టీయూసీ బెల్లంపల్లి ఏరియా ఉపాధ్యక్షుడు పేరం శ్రీనివాస్, కేంద్ర డిప్యూటీ జనరల్ సెక్రెటరి సంగెం ప్రకాష్, అధికారులు శ్రీనివాస్, ప్రశాంత్, నల్లగొండ సదాశివ్, ఏరి యా కార్యదర్శి నారాయణ, చీఫ్ ఆర్గనైజింగ్ సెక్రటరి గోలెం గట్టయ్య, ఆర్గనైజింగ్ కార్యదర్శి రాజేశం, కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.

## వయో పరిమితి పెంచిన ఘనత ఐఎన్టీయూసీదే

**- రాష్ట్ర కనీస వేతనాల సలహా మండలి చైర్మన్ బి జనక్‌ప్రసాద్**

మందమర్రి టౌన్, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): సింగరేణిలో డిపెండెంట్ ఉద్యోగాలకు సంబంధించి 35 నుంచి 40 సంవత్సరాల వయోపరిమితి పెంచిన ఘనత తమ యూనియన్‌దేనని ఐఎన్టీయూసీ సెక్రెటరీ జనరల్, కనీస వేతనాల సలహా మండలి చైర్మన్ జనక్ ప్రసాద్ తెలిపారు. శనివారం ఐఎన్టీయూసీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. త్వరలో కార్మికుల సొంతింటి కలనెరవేర్చే దిశగా అడుగులు వేస్తున్నామన్నారు. గుర్తింపు సంఘం ఎన్నికల సందర్భంలో కార్మికులకు ఇచ్చిన హామీలను ఏఐటీయూసీ ఇంతవరకు నెరవేర్చకపో వడం ఏమిటని ప్రశ్నించారు. అంతే కాకుండా కార్మికుల ఇన్‌కామ్ టాక్స్ యాజమాన్యమే చెల్లించే విధంగా చర్యలు చేపడుతున్నామని, నూతన గనుల ఏర్పాటు లక్ష్యంగా పనిచేస్తున్నామని అన్నారు. రానున్న రోజుల్లో 19 గనులు మూతపడనున్నాయని తెలిపారు. సింగరేణిలో అనేక సమస్యలు ఉన్నాయని, వాటిని పరిష్కరిస్తామని అన్నారు. సింగరేణి సంస్థకు కొత్త గనులు సాధించే వరకు తమ పోరాటం కొనసాగుతుం దని అన్నారు. సమావేశంలో కేంద్ర కమిటి సీనియర్ ఉపాధ్యక్షుడు కాంపెల్లి సమ్మయ్య, ఏరియా ఉపాధ్యక్షుడు దేవి భూమయ్య, రాంశెట్టి నరేందర్, ఆర్నకొండ అంజయ్య, బుచ్చయ్య, వై సత్యనారాయణ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జనక్ ప్రసాద్

**ఐఎన్టీయూసీతోనే కార్మికుల సంక్షేమం..**

సింగరేణిలో కార్మికుల సంక్షేమంతో పాటు హక్కుల సాధనలో ఐఎన్టీయూసీ ముందుంటుందని యూనియన్ సెక్రెటరీ జనరల్, రాష్ట్ర కనీస వేతనాల సలహామండలి చైర్మన్ బి జనక్‌ప్రసాద్ తెలిపారు. శుక్రవారం రాత్రి ఐఎన్టీ యూసీ కార్యాలయంలో ఏరియాలోని కేకే ఓసీకి చెందిన ఏఐటీయూసీ అసిస్టెంట్ బ్రాంచి సెక్రెటరీ, కేకే ఓసీ ఇన్‌చార్జి ఆర్నకొండ ఆంజనేయులు, నాయకులు వెంకటేశ్వర్లు, మిట్ట పోషం, పోగుల రమేష్‌తో సహా వారి అనుచ రులు ఐఎన్టీ యూసీలో చేరారు. వీరికి జనక్‌ప్రసాద్ కండువా కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గుర్తింపు సంఘం ఏఐటీయూసీ సాధిం చింది శూన్యమని అన్నారు. ఆ యూని యన్ విధానా లు నచ్చకనే తమ యూనియన్‌లో చేరు తున్నారని, వారికి సముచిత స్థానం కల్పిస్తామ న్నారు. కార్యక్ర మంలో కేంద్ర కమిటీ ఉపాధ్యక్షుడు కాంపెల్లి సమ్మ య్య, మందమర్రి ఏరియా ఉపాధ్యక్షుడు దేవి భూమయ్య, నాయకులు వై సత్యనారాయణ, మిట్ట సూర్యనారాయణ, సంఘ బుచ్చయ్య, మల్లికార్జున్ పాల్గొన్నారు.

### శ్రీరాంపూర్ డీజీఎం(పర్సనల్)గా అనిల్ కుమార్



శ్రీరాంపూర్, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): శ్రీరాంపూర్ ఏరియా డీజీఎం (పర్సనల్)గా అనిల్ కుమార్ శనివారం బాధ్యతలు చేపట్టారు. ఇప్పటి వరకు ఇక్కడ డీజీఎం (పర్సనల్)గా పనిచేసిన అరవింద రావు ఆర్‌జీ-2కు బదిలీ కాగా, ఆయన స్థానంలో ఆర్‌జీ-2 ఏరియాలో డీజీఎం (పర్సనల్)గా పనిచేస్తున్న అనిల్ కుమార్ శ్రీరాంపూర్‌కు వచ్చారు. అనంతరం డీజీఎం (పర్సనల్) అరవిందరావును ఏరియా జనరల్ మేనేజర్ ఎం శ్రీనివాస్ ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఎస్‌వోటూ జీఎం సత్యనారాయణ, అధికారుల సంఘం ఏరియా అధ్యక్షుడు వెంకటేశ్వర్‌రెడ్డి, ఏజీఎం (ఫైనాన్స్) బీభత్స, ఏరియా ఇంజనీర్ చంద్రశేఖర్‌రెడ్డి, పాల్గొన్నారు.

### సింగరేణిలో రాజకీయ జోక్యం సరికాదు

కాసిపేట,జూన్14(ఆంధ్రజ్యోతి): సింగరేణిలో రాజకీయ జోక్యం పెరిగిపోయి సంస్థ మనుగడకు ఇబ్బందికరంగా మారుతుందని ఏఐటీయుసీ సెంట్రల్ వైస్ ప్రెసిడెంట్ మిట్టపెల్లి వెంకటస్వామి అన్నారు. శనివారం కాసిపేట 1వ గనిపై నిర్వహించిన గేటు మీటింగ్‌లో ఆయన మాట్లాడుతూ కార్మికుల సమస్యలపై అలాగే కంపెనీలో రాజకీయ జోక్యం పెరగడం వల్ల సంస్థకు ఇబ్బందికరంగా మారిందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. కొంత మంది అధికార పార్టీ నాయకులు సింగరేణిలో సమావేశాలు నిర్వహిస్తూ సింగరేణిలో ఏమైనా చేస్తామంటూ అధికారులను బ్లాక్‌మెయిల్ చేస్తున్నారన్నారు. ఇలాంటి విధానాలను అధికార పార్టీల నాయకులు తక్షణమే విరమించుకోవాలి. అలాగే ఏఐటీయుసీపై చేస్తున్న అసత్య ఆరోపణలను ఆయన ఖండించారు. కార్మికుల పక్షాన పోరాడేది ఎర్రజెండా యూనియన్ ఏఐటీయుసీనే అన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయుసీ బెల్లంపల్లి బ్రాంచి కార్యదర్శి దాగాం మల్లేశ్, ఫిట్ సెక్రటరీ మీనుగు లక్ష్మీనారాయణ, అసిస్టెంట్ ఫిట్ సెక్రటరీ పర్వతి సురేశ్, వైస్ ప్రెసిడెంట్ చొప్పరి శ్రీహరి, కార్మిక సంఘాల నాయకులు సంతోష్, రంజిత్, అశోక్, నాగేశ్వర్‌రావు, శ్రీనివాస్, రవీందర్‌లు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఏఐటీయుసీ సెంట్రల్ వైస్ ప్రెసిడెంట్ వెంకటస్వామి

### ఆర్‌కే 7 గనిని సందర్శించిన కేరళ విద్యుత్ అధికారులు




ఆర్‌కే7 గని వద్ద విద్యుత్, సింగరేణి అధికారులు

శ్రీరాంపూర్, జూన్ 14 (ఆంధ్రజ్యోతి) : శ్రీరాంపూర్‌లోని ఆర్‌కే 7 గనిని సందర్శించిన కేరళ విద్యుత్ బోర్డు అధికారులు శనివారం సందర్శించారు. కేరళ విద్యుత్ బోర్డు చీఫ్ ఇంజనీర్ రాజన్ బృందానికి గ్రూప్ ఏజెంట్ రాజేందర్, మేనేజర్ తిరుపతి స్వాగతం పలికారు. అనంతరం వారు గనిలోనికి దిగి అక్కడి పని స్థలాలను పరిశీలించారు. గనిలో వాతావరణ పరిస్థితులు, బొగ్గు తీసే విధానం, తదితర వివరాలను తెలుసుకున్నారు. కార్మికులు రక్షణ నియమాలు పాటించేలా చర్యలు చేపడుతున్నామని, ఎస్డీఎల్ యంత్రం ద్వారా బొగ్గు ఉత్పత్తి చేస్తామని వారికి సింగరేణి అధికారులు వివరించారు. ఈ కార్యక్రమంలో ఆర్‌కే-7 గ్రూప్ ఇంజనీర్ రాజా రవిచరణ్, రక్షణాధికారి సంతోష్ రావు, కేరళ విద్యుత్ బోర్డు అధికారులు లత, అనిత, తదితరులు పాల్గొన్నారు.

### వన మహోత్సవాన్ని విజయవంతం చేయాలి

**- సీఎండీ ఎన్ బలరాం**



మాట్లాడుతున్న సీఎండీ

శ్రీరాంపూర్, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): సింగరేణి ఆధ్వర్యంలో నిర్వహించే వనమహోత్సవాన్ని విజయవంతం చేయాలని సీఎండీ ఎన్ బలరాం సూచించారు. సింగరేణి భవన్ నుంచి అన్ని ఏరియాల జీఎంలతో ఆయన వీడియో కాన్ఫరెన్స్ ద్వారా వివిధ అంశాలపై సమీక్ష నిర్వహించారు. ప్రతీఅడుగు పచ్చదనం చేసేందుకు సింగరేణి వ్యాప్తంగా 675 హెక్టార్లలో 45 లక్షల మొక్కలు నాటేందుకు సిద్ధం కావాలన్నారు. అలాగే 'నీటి బిందువు జల సింధువు' కార్యక్రమంలో భాగంగా ఇప్పటికే 60 మినీ చెరువుల నిర్మాణం చేపట్టినట్లు పేర్కొన్నారు. మిగిలినవి కూడా వారంలో పూర్తి చేయాలన్నారు. గనుల సమీప గ్రామాల్లో 43 చెరువుల్లో మట్టి పూడిక తొలగించేందుకు నిర్ణయించగా, కేవలం నాలుగు మాత్రమే పూర్తయినట్లు తెలిపారు. మిగిలిన వాటిలో మట్టి తొలగింపునకు అత్యవసరంగా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. వినియోగదారులకు నాణ్యమైన బొగ్గు అందించేందుకు చర్యలు చేపట్టాలన్నారు. జీ-14, జీ-15 గ్రేడ్ బొగ్గును నిలిపివేసి జీ-13 గ్రేడ్ బొగ్గును అందించాలన్నారు. చిన్న తరహా పరిశ్రమలకు అవసరమైన బొగ్గును అందించేందుకు హైదరాబాద్‌కు సమీపంలో విక్రయ కేంద్రాన్ని ఏర్పాటు చేయనున్నట్లు ఆయన వివరించారు. కార్యక్రమంలో డైరెక్టర్(ఈఎం) సత్యనారాయణ, డైరెక్టర్(ఆపరేషన్స్) సూర్యనారాయణ, డైరెక్టర్ (ప్లానింగ్‌అండ్‌ప్రాజెక్ట్స్) వెంకటేశ్వర్లు, ఈడీ (కోల్‌మూమెంట్) సుభానీ, జీఎం(సీపీపీ) మనోహర్, జీఎం (మార్కెటింగ్) రాజశేఖర్‌రావు, అన్ని ఏరియాల జీఎంలు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## వైద్య శిబిరం

కాసిపేట, జూన్14 (ఆంధ్రజ్యోతి): దేవాపూర్ అదాని గ్రూప్ ఓరియంట్ సిమెంట్ కంపెనీ ఆధ్వర్యంలో శనివారం దేవాపూర్‌లో వైద్య శిబిరం నిర్వహించారు. ఈశిబిరంలో కార్డియాలజిస్ట్ డాక్టర్ వాసుదేవరెడ్డి, జనరల్ ఫిజిషియన్ డాక్టర్ లోకేష్, వైద్య శిబిరంలో హాజరై 65 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈశిబిరంలో 2డిఏకో, బ్లడ్ ప్రెషర్ మానిటరింగ్, ఈసీజీ, మధుమేహ పరీక్షలు, బోన్ మినరల్ డెన్సిటీ పరీక్షలు అందించారు. ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో యూనిట్ హెడ్ బాలగిరిధర్, డాక్టర్ నవీన్‌రావు, ఉమాశంకర్ పాల్గొన్నారు.

## యూపీఎస్సీలో 138వ ర్యాంకు


అభినవ్ వర్మ

దండేపల్లి జూన్ 14 (అంధ్ర జ్యోతి): యూపీఎస్సీ ఆధ్వర్యంలో నిర్వహిం చిన సెంట్రల్ ఆర్మ్‌డ్ పోలీస్ ఫోర్సెస్ అసిస్టెంటు కమాండెంటు (సీఏపీఎఫ్ ఏసీ)పరీక్షల్లో దండేపల్లి మండలం నెల్కివెంకటాపూర్ గ్రామానికి చెందిన పెట్టెం అభినవ్ వర్మ జాతీయ స్థాయిలో 138వ ర్యాంకు సాధించాడు. 2024ఆగస్టులో సీఏపీఎఫ్ అసిస్టెంటు కమాండెంట్ పరీక్ష కోసం నోటిఫికేషన్ రాగా జాతీయ స్థాయిలో పరీక్ష నిర్వహించగా అభినవ్‌వర్మ 138వ ర్యాంకు సాధించాడు. ఆయన మంచిర్యాలలో పదో తరగతి, హైదరాబాద్‌లో ఇంటర్, జోధాపూర్‌లో ఐఐటి పూర్తి చేశాడు. గతంలో కూడా ఈదే పరీక్ష రాసి ఫెయిల్ అవ్వగా, పట్టుదలతో మళ్లీ చదువుకోని ఇప్పుడు ఈదే పరీక్షలె జాలీయ స్థాయిలో 138వ ర్యాంకు సాధించాడు. ఈ సందర్భంగా వారి తల్లిదండ్రులు, మండల వాసులు అభినవ్‌వర్మను అభినందించారు.

# అక్రమాల నిగ్గు తేలేనా..?


నస్పూర్‌లోని టీఎస్జీవోస్ కాలని

- టీఎన్జీవోస్ హౌసింగ్ సొసైటీలో అవకతవకలపై మరోసారి విచారణకు ఆదేశం...
- కమిటీకి నోటీసులు ఇస్తాం... విచారణాధికారి



నస్పూర్, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): టీఎన్జీవోస్ హౌసింగ్ సొసైటీలో జరిగిన అవకతవకలను నిగ్గు తేల్చేందుకు రంగం సిద్ధమైంది. కొంద రు సొసైటీ నాయకులు ప్లాట్ల నంబర్లనే మా ర్చుకుని అనుకూలమై ప్రాంతంలో ప్లాట్‌లో ఇంటి నిర్మాణం చేసారు. నిబంధనలకు విరుద్ధంగా దక్కించుకున్న ప్లాట్ల వ్యవహారం ఈ సారైనా బయటకు వస్తాయా.. లేదా గుట్టు చప్పుడు కాకుండా ఫైల్‌ను మూసి వేస్తారా..? అనే అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి.

నస్పూర్ శివారులోని 42 సర్వే నంబరులో తెలంగాణ నాన్ గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ మ్యూచువల్లీ ఎయిడెడ్ కో ఆపరేటివ్ హౌసింగ్ సొసైటీ (టీఎన్జీవోస్) ప్లాట్ల కేటాయింపులో జరిగిన అక్రమాలు, అవకతవకలపై తాజాగా మరోసారి విచారణకు సహకార శాఖ కమిషనర్ ఆదేశాలు జారీ చేసింది.

సహకార చట్టం 1995 సెక్షన్ 29 ప్రకారం సమగ్ర నివేదిక ఇవ్వాలని ఆదేశించింది. నిబంధనలకు విరుద్ధంగా ప్లాట్ల కేటాయింపులు, ఇళ్ల నిర్మాణాలు జరిగినట్లు గుర్తించారు. సొసైటీలో జరిగిన అవకతవకలపై సమగ్ర విచారణ చేసి నివేదికను 45 రోజుల్లో అంద జేయాలని జిల్లా అసిస్టెంట్ రిజిస్ట్రర్ అధికారి హన్మంతరెడ్డికి ఆదేశాలు వచ్చాయి. దీంతో సహకార శాఖ అధికార యంత్రాంగం విచారణకు సన్నద్ధం అవుతోంది.

### సొసైటీలో 341 మంది సభ్యులు...

టీఎన్‌జీవోస్ హౌసింగ్ సొసైటీ ద్వారా దాదాపు 341 మంది సభ్యులకు ప్లాట్ల కేటాయింపు జరగాల్సింది. ప్రతి సభ్యుడికి 175 గజాల స్థలాన్ని కేటాయించారు. ఇందులో కొందరు ఇచ్చిన 175 గజాల కంటే ఎక్కువ విస్తీర్ణంలో నిర్మాణం చేసారనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. కొందరు సొసైటీ నాయకులే నిబంధనలు పాటించకుండా ఎక్కువ స్థలంలో భవనాల నిర్మాణం చేసినట్లు ఇదివరకు నిర్వహించిన విచారణలో తేలింది.

టీఎన్జీవోస్, హౌసింగ్ సొసైటీ నిర్వహణలో పాలు కూడా వెలుగులోకి వచ్చాయి. 2010లో సభ్యులకు 175 గజాల చొప్పున ఇంటి స్థలాన్ని 341 మందికి కేటాయించారు. ప్లాట్ల పంపిణీలో చాలా అవకత వకలు చోటు చేసుకున్నాయని కొందరు సభ్యులు సీసీ ఎల్ఏకు ఫిర్యాదు చేశారు. కలె క్టర్ ఆదేశాల మేరకు జిల్లా సహకార శాఖ అధికారి ఆడిట్ చేసి గత ఏడాది నవంబరులో నివే దికను సమర్పించారు. విచారణలో ఆసక్తిక రమైన అంశాలు బయటపడ్డాయి. కొందరికి కేటాయించిన ప్లాట్లలో విస్తీర్ణంలో తేడాలు ఉం డడం, ఒక చోట ప్లాటు ఉంటే మరోచోట అనుకూలమైన చోట ఇంటిని నిర్మాణం చేసిన ట్లు గుర్తించారు. అంతే కాకుండా సొసైటీ నిర్వహణ లెక్కల్లో కూడా తేడాలు, ఎన్నికల నిర్వహ ణ సక్రమంగా లేకపోవడం వివిధ అంశాలపై అవకతవకలు నివేదికలో బయట పడ్డాయి. ఈ అంశాలపై సమగ్ర విచారణను మరో సారి చేసి నివేదికను ఇవ్వాలని సహకార శాఖ అధికారులు నిర్ణయించారు. మరోసారి జరిపే విచారణలో నిజాలను తేల్చి బాధ్యులపై చర్యలు చేపడుతారా..? అన్న అంశం ఆసక్తికరంగా మారింది.

### సంఘ సభ్యుడే విచారణాధికారి...?

టీఎన్జీవోఎస్ హౌసింగ్ సొసైటీలో సభ్యుడిగా కొనసాగుతున్న హన్మంతరెడ్డినే మరోసారి జరిగే విచారణకు అధికారిగా నియమించారు. దీని మూలంగా అనేక అనుమానాలకు తావిస్తోంది. న్యాయబద్ధంగా విచారణ జరుగుతుందా అనే అనుమానాలు ఉత్పన్నమవుతున్నాయి. ఇలాగైతే సొసైటీలో జరిగే అవకతవకలను ఏలా బయటకు వస్తాయని పలువురు సభ్యులు అనుమానిస్తున్నారు. టీఎన్జీవోఎస్‌కు సంబంధంలేని ఇతర జిల్లాలకు చెందిన అధికారులను నియమిస్తే బాగుండేదని అనుకుంటున్నారు.

### సొసైటీకి నోటీసులు ఇస్తాం...
**విచారణాధికారి జి. హన్మంతరెడ్డి**



టీఎన్జీవోఎస్ హౌసింగ్ సొసైటీకి నోటీసులు ఇస్తాం. వారి నుంచి వచ్చిన వివరాలను పరిశీలించి సభ్యులందరికీ నోటీసులు ఇస్తాము. ఇప్పటి వరకు గుర్తించిన అంశాలపై సమగ్ర విచారణ చేస్తాం. నిబంధనలకు విరుద్ధం ఉంటే ఆధారాలు సేకరిస్తాం. సమగ్ర విచారణ చేసి నివేదికను పై అధికారులకు అందజేస్తాం.

## నెరవేరనున్న క్రీడాకారుల కల..

(1వ పేజీ తరువాయి)

ఆశలు నెరవేరలేదు. జిల్లాలోని కోల్‌బెల్ట్ ప్రాంతాలైన బెల్లంపల్లి, మందమర్రి, శ్రీరాంపూర్‌లలో సింగరేణి ఆధ్వర్యంలో స్టేడియాలు నిర్మించినా, అ వి పూర్తిస్థాయిలో క్రీడాకారులకు అందుబాటులో లేకపోవడంతో తిరిగి ఎప్పటి పరిస్థితే పునరావృతం అవుతోంది. స్టేడియం నిర్మాణంలో గత పాలకుల నిర్లక్ష్యం కారణంగా దశాబ్దాల కాలంగా స్థలం ఎంపికకు కూడా నోచుకోలేదు.

### ఇండోర్ స్టేడియం నిర్మాణానికి మోక్షం..

కాగా దశాబ్దాల కాలం తరువాత ఎట్టకేలకు జిల్లా కేంద్రంలో ఇండోర్ స్టేడియం నిర్మాణానికి మోక్షం కలిగింది. జిల్లా కేంద్రంలోని సాయికుంటలో ప్రభుత్వం స్థలం సర్వే నెంబర్లు 662, 675లలో 12 ఎకరాల స్థలాన్ని ఎమ్మెల్యే ప్రేంసాగర్‌రావు సూచనలతో స్పోర్ట్స్ అథారిటీకి కేటాయిస్తూ రెవెన్యూశాఖ నిర్ణయం తీసుకుంది. ఆ స్థలంలో సుమారు రూ. 30 కోట్ల అంచనా వ్యయంతో మల్టీ పర్పస్ ఇండోర్ స్టేడియం నిర్మించేందుకు మార్గం సుగమం అయింది. అందులో వాలీబాల్, బాస్కె ట్‌బాల్, కబడ్డీ, ఖోఖో, బ్యాడ్మింటన్, జూడో, రెజ్లింగ్, టేబుల్ టెన్నిస్, తదితర క్రీడలు ఆడేందుకు ఇంటర్నేష నల్ స్టాండర్డ్స్‌తో రూ. 14 కోట్లతో ఇండోర్ స్టేడియం నిర్మాణం చేపట్టనున్నారు. అలాగే రూ. 9.5 కోట్లతో 400 మీటర్ల సింథటిక్ ట్రాక్, రూ. 6 కోట్లతో స్విమ్మింగ్ పూల్ నిర్మించేందుకు ప్రణాళికలు సిద్ధమయ్యాయి. ఈ మేరకు త్వరలో డీపీఆర్ సిద్ధం చేస్తుండగా, వెంటనే పనులు చేపట్టనున్నారు. ఇండోర్ స్టేడియం అంచనా వ్యయంలో కొంత మొత్తం ఖేలో ఇండియా భరించనుండగా, మిగతా నిధులు రాష్ట్ర ప్రభుత్వం కేటాయించనుంది. అలాగే ఇండోర్ స్టేడియం ఆవరణలో స్పోర్ట్స్ హాస్టల్ నిర్మాణం చేపట్టేందుకూ ప్ర ణాళికలు సిద్ధం చేస్తున్నారు. 150 మందికి వసతి కల్పించేలా ఏర్పాట్లు చేస్తుండగా...క్రీడాకారులకు అవసరమయ్యే శిక్షణ ఇచ్చే విధంగా సౌకర్యాలు కల్పించనున్నారు. మంచిర్యాలలో న్యూఢిల్లీ- సికింద్రాబాద్ దక్షిణ మధ్య ప్రధాన రైల్వే మార్గం అందుబాటులో ఉండటంతో స్పోర్ట్స్ మీట్‌ల సమయంలో వివిధ ప్రాంతాల నుంచి క్రీడాకారులు రాకపోకలు సాగించేందుకు అనుకూలంగా ఉంటుంది.

## ఖాళీ బిందెలతో గ్రామస్థుల ధర్నా

తాండూర్, జూన్ 14 (ఆంధ్రజ్యోతి) : తాండూర్‌లో మిషన్ భగీరథ నీటిని అందించాలని కోరుతూ గ్రామస్థులు శనివారం రోడ్డుపై బైఠాయించి ఆందోళన చేపట్టారు. తమ గ్రామం నుంచి వివిధ గ్రామాలకు మంచినీటిని తరలిస్తున్నారని, కానీ తమ గ్రామానికి మంచినీటిని అందించడం లేదని గ్రామస్తులు ఆరోపించారు. గతంలో ధర్నా చేస్తే అధికారులు వచ్చి హామీ ఇచ్చి వెళ్లిపోయారే తప్ప ఇచ్చిన హామీని నిలబెట్టుకోలేదన్నారు. తాగునీటి సమస్య ఉన్నా పట్టించుకునే నాథుడే కరువయ్యాడని ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే నీటి సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కాగా రోడ్డుపై ఆందోళన చేయడంతో వాహనాలు నిలిచిపోయాయి.

## రోడ్డు భద్రతపై విద్యార్థులకు అవగాహన


ట్రాఫిక్ సిగ్నల్ పై వివరిస్తున్న ఎస్సై

భీమిని, జూన్ 14 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని కస్తూర్బా బాలికల ఆశ్రమ పాఠశాల విద్యార్థులకు శనివారం పోలీసులు ట్రాఫిక్ రూల్స్ రోడ్డు సేఫ్టీపై అవగాహన కల్పించారు. విద్యార్థులను ఆర్ అండ్‌బీ రోడ్డుపై తీసుకొని వచ్చి రహదారి భద్రత నియమాలను స్వయంగా తెలియజేశారు. ఈ సందర్భంగా ఎస్సై విజయ్ కుమార్ వారితో మాట్లాడుతూ జీబ్రా క్రాసింగ్ వద్ద మాత్రమే రోడ్డును దాటాలని, సైకిల్‌పై ప్రయాణించే వారు జాగ్రత్తగా ఉండాలన్నారు. రోడ్డు భద్రతపై అవగాహన ఉంటే ప్రమా దాలను నివారించవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, పోలీసులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## రసవత్తరంగా పద్మశాలి సంఘం ఎన్నికలు

మందమర్రి టౌన్, జూన్ 14 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని పద్మశాలి అధ్యక్ష ఎన్నికలు రసవత్తరంగా మారాయి. ఆదివారం ఈ నెల 15న స్థానిక పద్మశాలి భవన్‌లో ఎన్నికలు జరగనున్నాయి. ఎన్నికలకు అన్ని ఏర్పాట్లు చేశారు. ప్రధానంగా మాజీ అధ్యక్షుడు బత్తుల శ్రీనివాస్‌తోపాటు బత్తుల సతీష్‌ల మధ్య పోటీల నెలకొంది. 482 ఓటర్లు ఉండగా ఎవరికి వారే తమను గెలిపించాలంటూ అభ్యర్థిస్తున్నారు. ఇటీవల కాలనీల వారీగా పెద్ద ఎత్తున ప్రచారం నిర్వహించారు. ఎన్నికల గుర్తులు కూడా కేటాయించడంతో ప్రచారం చేస్తున్నారు. ఓటర్లు ఎవరిని ఆశీర్వదిస్తారనేది ఆదివారం సాయంత్రం వరకు తేలనుంది.

## జర్నలిస్టుల సమస్యలపై నిరంతర పోరాటం

హాజీపూర్, జూన్14 (ఆంధ్రజ్యోతి): జర్నలిస్టుల సమస్యలపై నిరంతరం పోరాడేందుకు కృషి చేస్తున్నట్లు టీడబ్ల్యుజెఏఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బసవ పున్నయ్య అన్నారు. శనివారం వేంపల్లిలోని మంచిర్యాల గార్డెన్స్‌లో జిల్లా 3వ మహాసభల్లో పాల్గొని మాట్లాడారు. జర్నలిస్టుల కనీస సమస్యలను ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదని విమర్శించారు. కొత్త సంవత్సరం వచ్చి ఆరు నెలలు కావస్తున్న అక్రిడిటేషన్ కార్డులకు ఇంకా స్టిక్కర్లు వేస్తూ కాలం వెల్లదీస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో టీడబ్ల్యుజెఏఫ్ రాష్ట్ర కార్యవర్గ ఉపాధ్యక్షులు రాజశేఖర్, రాష్ట్ర కార్యదర్శి చంద్రశేఖర్ పాల్గొన్నారు.

- టీడబ్ల్యుజేఏఫ్ మంచిర్యాల జిల్లా మూడవ మహాసభలో శనివారం జిల్లా కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు.అధ్యక్షుడిగా తోట్ల మల్లేశ్‌యాదవ్, కార్యదర్శిగా మధుసూదన్, ఉపాధ్యక్షులుగా చందు, జీవన్, లక్ష్మణ్, సంయుక్త కార్యదర్శిగా రవికుమార్, కోశాధికారిగా క్యాతం రాజేశ్, జాతీయ కౌన్సిల్ సభ్యులుగా ముత్యం వెంకటస్వామి విజయక్రాంతి, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులుగా మేకల ప్రభాకర్, ఆవిడపు వెంకటేశ్, గోపతి సత్తయ్య ఎన్నుకున్నారు.

## పల్లంగూడ పంచాయతీలో తాగునీటికి కటకట


మరమ్మతులకు నోచుకోని చేతిపంపు

కాసిపేట, జూన్14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పల్లంగూడ పంచాయతీలో తాగునీటికి తీవ్ర కటకట నెలకొంది. చేతి పంపులు చెడిపోయినప్పటికీ పట్టించుకునే నాథుడే లేకపోవడం వల్ల తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. చేతిపం పుల వద్ద ప్లాట్ ఫాంలు చెడిపోవడం వల్ల నీరు భూమిలోకి ఇంకి తాగునీరు కలుషితమవుతోంది. వర్షాకాలం ఆరంభంలో నీరు కలుషితమై ప్రజలు రోగాలు భారినపడే అవకాశం ఉంది. దీనిపై సంబంధిత అధికారులకు చెప్పినా ఎవరు పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైన సంబంధిత శాఖ అధికారులు స్పందించి చేతిపంపులకు మరమ్మతులు చేయాలని కోరారు.

## అక్కడి కంపు.. ఇక్కడ డంపు


ముల్కల్ల శివారులో డంప్ చేస్తున్న సెప్టిక్ ట్యాంకర్లు

హాజీపూర్ జూన్ 14 (ఆంధ్రజ్యోతి): సెప్టిక్ ట్యాంక్ నిండిందా.. వెంటనే కాల్ చేయండి అంటూ గ్రామాల్లోని గోడలపై వాల్ రైటింగ్‌లు రాస్తూ ప్రచారం చేస్తుంటారు. సెప్టిక్ ట్యాంక్ యజమానులు మంచిర్యాల జిల్లా కేంద్రంలో సెప్టిక్ ట్యాంక్‌లలో నిండిన కంపును ట్యాంకర్లలో నింపుతూ సమీప ప్రాంతాలైన వేంపల్లి, ముల్కల్ల, గుడిపేటలలో జాతీయ రహదారి పక్కన డంప్ చేస్తున్నారు. ముల్కల్ల శివారు జాతీయ రహదారికి అనుకుని మూడు సెప్టిక్ ట్యాంకర్లు డంప్ చేయడంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేశారు. సంబంధిత అధికారులు సెప్టిక్ ట్యాంకులు జనావాసాల మధ్య డంప్ చేయకుండా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

## పెద్దమ్మతల్లి గుడి నిర్మాణ పనులను అడ్డుకోవద్దని వినతి


తహసీల్దార్ భోజన్నకు వినతిపత్రం అందజేస్తున్న పెద్దమ్మగుడి సభ్యులు

కాసిపేట, జూన్14 (ఆంధ్రజ్యోతి): మండలం కేంద్రంలోని ముత్యంపల్లి పంచాయతీలో నిర్మిస్తున్న పెద్దమ్మగుడి నిర్మాణ పనులను అడ్డుకోవద్దని ఆలయ కమిటీ సభ్యులు బీజేపీ మండల శాఖ ఆధ్వర్యంలో తహసీల్దార్ భోజన్నకు వినతిపత్రం అందజేశారు. ఈసం దర్భంగా బీజేపీ మండల అధ్యక్షులు సూరం సంపత్ మాట్లాడుతూ ముత్యం పల్లిలో యాదవ సంఘం అధ్వ ర్యంలో 2019 పెద్దమ్మ తల్లి గుడి నిర్మాణ పనులను ప్రారంభించామన్నారు. గుడి రక్షణ కోసం ప్రహరిగోడ నిర్మాణ పనులను ప్రభుత్వం అడ్డుకోవడం బాధాకరమన్నారు. అనంతరం తహసీల్దార్ భోజన్నకు వినతి పత్రం అందజేశారు.

ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ గౌరవ అధ్యక్షులు బోయిని తిరుపతియాదవ్, స్థానిక నాయకులు దేవునూరి సంతోష్, అనిల్, బాలాజీ, ఆర్ఎస్ఎస్ పోచం, కమిటీసభ్యులు రేచినేని స్వామి, బోయిని రాములు, రేచినేని మల్లయ్య, శ్రీను, శేఖర్, శంకర్, బాపు పాల్గొన్నారు.

## నిజాయితీగా పనిచేస్తా..నిధులు తీసుకొస్తా..

**మంత్రి వివేక్ వెంకటస్వామి**


జైపూర్‌లో మంత్రి వివేక్‌వెంకట స్వామిని గజమాలతో సత్కరిస్తున్న కాంగ్రెస్ నాయకులు

జైపూర్, జూన్ 14 (ఆంధ్రజ్యోతి) : నిజాయితీగా పనిచేసి చెన్నూరు నియోజకవర్గానికి నిధులు తీసుకువస్తానని కార్మిక, గనుల శాఖ మంత్రి వివేక్‌వెంకటస్వామి పేర్కొన్నారు. మంత్రిగా ప్రమాణ స్వీకారం చేసి తొలిసారిగా జిల్లాకు వచ్చిన మంత్రి వివేక్‌కు శనివారం కాంగ్రెస్ నాయకులు డీజే చప్పుళ్లతో ఘనంగా స్వాగతం పలికారు. గజమాలలతో సత్కరించారు. ఈ సందర్భంగా మంత్రి వివేక్ మాట్లాడుతూ చెన్నూరు నియోజకవర్గంలో అవినీతి లేకుండా అభివృద్ధి చేస్తానని పేర్కొన్నారు. ఇసుక దందా బంద్ చేయాలని ప్రజలు కోరడంతో చెన్నూరు నియోజకవర్గంలో ఇసుక దందా బంద్ చేయించానన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇసుక అక్రమ రవాణా జరగకుండా మైనింగ్ శాఖను తనకు ఇచ్చారని, ఇసుక రాయల్ టాక్స్‌తో నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తానన్నారు. గత ప్రభుత్వం కాంగ్రెస్ నాయకులపై అక్రమ కేసులు పెట్టి భయ భ్రాంతులకు గురి చేసిందన్నారు. నియోజకవర్గంలోని ప్రతి గ్రామంలో రూ. 50 లక్షల నిధులతో అభివృద్ధి పనులను చేశామన్నారు. ప్రజలకు అందుబాటులో ఉండి సేవలందిస్తున్నానన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా నాయకులు రిక్కుల శ్రీనివాస్‌రెడ్డి, మండల అధ్యక్షుడు ఫయాజ్, విశ్వంభర్‌రెడ్డి, శ్రీనివాస్‌యాదవ్, కార్యకర్తలు పాల్గొన్నారు.

### అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు

భీమారం : మండలంలోని అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు ఇచ్చి పేదవారి ఇంటి కలను సాకారం చేస్తానని కార్మిక, ఉపాధి మైనింగ్ శాఖ మంత్రి డాక్టర్ వివేక్‌వెంకటస్వామి పేర్కొన్నారు. శనివారం మండలానికి రావడంతో కాంగ్రెస్ నాయకులు పెద్ద ఎత్తున బైక్ ర్యాలీ నిర్వహించి గజ మాలలతో మంత్రికి స్వాగతం పలికారు.

ఆవడం ఎక్స్ రోడ్డులో ఏర్పాటు చేసిన రోడ్‌షో సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇందిరమ్మ ఇళ్లు అర్హులందరికీ అందుతాయన్నారు. మండలానికి ఇప్పటి వరకు పెద్ద ఎత్తున నిధులు కేటాయించి గ్రామాలను అభివృద్ధి చేశానని, రోడ్లు నిర్మాణం చేపట్టానన్నారు. బూరుగుపల్లి నుంచి దాంపూర్ వరకు రూ. 3.50 కోట్లతో బీటీ రోడ్డు పనులను ప్రారంభించామని దీన్ని త్వరగా పూర్తి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు చేకుర్తి సత్యనారాయణరెడ్డి, మోహన్‌రెడ్డి, పోడేటి రవి, రాంరెడ్డి, ప్రకాష్‌రెడ్డి, అశోక్, లక్ష్మణ్, శ్రీనివాస్, రవితేజ, తైనేని రవి, తిరుపతి, రాజ్‌కుమార్, తిరుపతి, శ్రీనివాస్ పాల్గొన్నారు.

## అధ్వానంగా రోడ్డు..
**ఇబ్బందులు పడుతున్న వాహనదారులు**

వేమనపల్లి, జూన్ 14 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని బుయ్యారం నుంచి వేమనపల్లికి వెళ్లే రోడ్డు అధ్వానంగా తయారైంది. ఇటీవల కురిసన వర్షాలకు రోడ్డు గుంతల మయంగా ఉండడంతో గుంతల్లో వర్షం నీరు చేరడంతో వాహనాలు అతి కష్టం మీద వెళ్తున్నాయి. వర్షం పడినప్పుడల్లా గుంతల్లో చేరిన నీటిలో నుంచి వాహనాలు వెళ్లడంతో ద్విచక్రవాహనాలు అదుపు తప్పి కింద పడుతున్నాయి. 16 కిలో మీటర్ల పొడవున ఉన్న ఈ రోడ్డు కంకర లేచిపోయి గతంలో వేసిన తారు అంతా లేచిపోయి గుంతల మయంగా మారింది. మండల కేంద్రానికి వెళ్లాలంటే బుయ్యరం, జిల్లెడ, జక్కెపల్లి, నాగారం, సూరారం, లక్ష్మీపూర్, బమ్మెన గ్రా మాల ప్రజలు అతి కష్టం మీద వెళ్తున్నారు.

ఎన్నికల ముందు ఈ రోడ్డును బాగు చేస్తామని హామీ ఇచ్చి గెలిచిన తర్వాత మర్చిపోతున్నారని ప్రజలు పేర్కొంటున్నారు. ఇదే మార్గంలో నాగారం నుంచి మంగెనపల్లి వరకు అటవీ ప్రాంతం ఉండడం, అటవీ ప్రాంతంలో బీటీ రోడ్డు కాకుండా అటవీ శాఖ అధికా రులు అడ్డుకోవడంతో సుమారు 5 కిలో మీటర్ల వరకు మట్టి రోడ్డే ఉంది. దీంతో వర్షానికి రోడ్డంతా బుర దమయంగా మారి వాహనాలు వెళ్లలేని పరిస్థితి నెల కొంటోంది. ఇప్పటికైనా స్థానిక ఎమ్మెల్యే, అధికారులు స్పందించి రోడ్డుకు మరమ్మ తులు చేయాలని, అటవీ ప్రాంతంలోని రోడ్డు పనులు జరిగేలా కృషి చేయాలని ప్రజలు కోరుతున్నారు. మున్ముందు ఇంకా భారీ వర్షాలు పడే అవకాశం ఉన్నదని, సమస్య జఠిలం కాకముందే రహదారి సరి చేయాలని గ్రామస్థులు కోరుతున్నారు.

## ఎంఎస్ఎంఈపై అవగాహన సదస్సు


ధర్మరావుపేటలో మహిళలకు అవగాహన కల్పిస్తున్న జిల్లా కోఆర్డినేటర్ కవిత

కాసిపేట, జూన్14 (ఆంధ్రజ్యోతి): నిరుద్యోగ యు వతీ యువకులు చిన్న తరహా పరిశ్రమలు నెలకొల్పి వారిని ఆర్థికంగా బలోపేతం చేసేందుకు ఎంఎస్ఎం ఈపై శనివారం ధర్మరావుపేటలో అవగాహన కార్యక్ర మం నిర్వహించారు. ఈసందర్భంగా మండల ప్రత్యేకా ధికారి అజ్మీర పురుషోత్తం నాయక్ మాట్లాడుతూ మి నిస్టరీ ఆఫ్ స్మాల్ స్కేల్ మీడియం ఎంటర్ ప్రైజెస్ ఆ ధ్వర్యంలో చిన్న స్థాయి పరిశ్రమలు రుణాలు అందజే స్తామన్నారు. అర్హత ఆసక్తి ఉన్నవారు దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. అనంతరం సమృద్ధి సొసై టీ జిల్లా కోఆర్డినేటర్ కవిత మాట్లాడుతూ ఉదయం రిజిస్ట్రేషన్ ఈ మార్కెటింగ్‌లపై అవగాహన కల్పించారు. ఎంఎస్ఎంఈపై అవగాహన పెంచుకొని ప్రతి ఒక్కరు ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి సిహెచ్ ప్రభాకర్, ఐకేపీ సిబ్బంది సంకూ రి రాజమల్లు, ఆర్ శ్రీనివాస్, సమృద్ధి సొసైటీ జిల్లా కార్యదర్శి ప్రకాశ్‌లు పాల్గొన్నారు.

## అద్దె భవనాల్లో ప్రభుత్వ కార్యాలయాలు
**అధికారులు, ప్రజలకు తప్పని ఇబ్బందులు**




దండేపల్లిలో బీఎస్ఎన్ఎల్ కార్యాలయం

దండేపల్లి జూన్ 14 (ఆంధ్రజ్యోతి): దండేపల్లి మండల కేంద్రంలో ప్రభుత్వ కార్యాలయాలకు సొంతగూడ లేక అటు అధికారులు, సిబ్బంది, ఇటు మండల ప్రజలు ఇక్కట్లు ఎదుర్కొంటున్నారు. మండలంలో తపాల కార్యాలయం, బీఎస్ఎన్ఎల్ కార్యాలయంతో పాటు బీసీ బాలుర వసతి గృహం, గంథ్రాలయాలకు పక్కా భవనాలు లేక దశాబ్ధ కాలం నుంచి అద్దె భవనాలలో కొనసాగుతున్నాయి. వసతులు అంతంతా మాత్రంగానే ఉన్నాయి. ఏళ్ల తర బడి పక్కా భవనాలు నిర్మించ కుండా లక్షలాది రూ పాయలు అద్దె చెల్లిస్తూ కాలం వెళ్లదీస్తున్నారు. దీంతో ప్రభుత్వ కార్యాలయాలకు ఎదైనా అవసరం మీద వచ్చే ప్రజలకు తీవ్ర ఇబ్బందులు తప్పడం లేదు. ఇప్పటికైన పాలకులు అధికారులు స్పందించి అద్దె భవనాల్లో కొనసాగుతున్న ప్రభుత్వ కార్యాలయాలకు పక్కా భవనాలు నిర్మించే చర్యలు చేపట్టాలని మండల ప్రజలు కోరుతున్నారు.






# 'కస్తూర్బా'లో కొత్త రుచులు

- బాలికల పౌష్టికాహారంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి
- వారానికి రెండుసార్లు చికెన్, ఐదుసార్లు గుడ్లు
- అల్లం చాయ్, మిల్లెట్ బిస్కెట్లు
- ప్రారంభమైన కొత్త మెనూ
- వంట మనుషులకు పూర్తయిన శిక్షణ

బెజ్జూరు, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): కస్తూర్బా విద్యాలయాల్లో(కేజీబీవీ) చదివే బాలికలకు పౌష్టికాహారం అందించేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టింది. నాణ్యమైన విద్యతో పాటు మెరుగైన వసతి సౌకర్యాలు కల్పించేందుకు కస్తూర్బా విద్యాలయాలను దేశవ్యాప్తంగా కేంద్రం నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. వీటి నిర్వహణ బాధ్యతలను రాష్ట్ర ప్రభుత్వం చూసుకుంటుంది. అయితే ఇటీవల కస్తూర్బా బాలికల విద్యాలయాల్లో చదివే బాలికల ఆరోగ్యంపై ప్రభుత్వం నిర్వహించిన సర్వేలో బాలికలు పౌష్టికాహారలోపంతో ఆరోగ్య సమస్యలు ఎదుర్కొంటున్నట్లు తేలింది. దీంతో ప్రభుత్వం బాలికలకు చదువుతో పాటు పోషకాహారం అందించాలని నిర్ణయించింది.ఈ మేరకు గురుకుల విద్యాలయాల్లో మాదిరిగానే కేజీబీవీల్లో కూడా మెస్ చార్జీలను పెంచి విద్యార్థుల ఆహార మెనూలోమార్పులు చేసింది.

**● పెరిగిన మెస్ చార్జీలు..**

గతంలో కస్తూర్బా బాలిక విద్యాలయాల్లో చదివే ఒక్కో విద్యార్థికి మెస్ చార్జీల కింద 1,225 రూపాయలు అందించగా, ఇప్పుడు దీన్ని 1,740రూపాయలకు పెంచారు. అంటే గతంలో కంటే 515 రూపాయలు మెస్ చార్జీలు పెంచారు. పాఠశాలలు ప్రారంభమైన గురువారం నుంచే కొత్త మెనూ అమల్లోకి తీసుకువచ్చింది. దీని ప్రకారం కేజీబీవీ బాలికలు ఈ ఏడాది నుంచి కొత్త వంటలు రుచి చూస్తున్నారు. కొత్త మెనూ ప్రకారం నెలలో రెండుసార్లు మాంసాహారం, వారంలో ఐదుసార్లు గుడ్లు, ప్రతిరోజూ నెయ్యి వడ్డిస్తారు. కొత్త ఆహార మెనూ రూపొందించిన ప్రభుత్వం దీన్ని అమలు చేసే బాధ్యతను విద్యాశాఖకు అప్పగించింది. ప్రభుత్వ ఆదేశాలతో విద్యాశాఖ అధికారులు కొత్త మెనూ అమలు పరుస్తున్నారు. సమర్థవంతంగా అమలు చేయడానికి కొత్త వంటకాల తయారీపై సిబ్బందికి ప్రత్యేక శిక్షణ ఇచ్చారు. కొత్త వంటకాల తయారీపై తొలుత హైదరాబాద్‌లో 8వ తేదీన కొందరికి శిక్షణ ఇచ్చారు. అక్కడ శిక్షణ పొందిన వారితో జిల్లాలోని మిగితా వారందరికీ ప్రాంతాల వారీగా వంటకాల తయారీపై శిక్షణ ఇచ్చారు.ఈ శిక్షణ కార్యక్రమాలు మంగళవారం ముగిశాయి.

**● మారిన మెనూ..**

ఈ పథకాన్ని అమలు చేసేందుకు స్కూళ్ల ప్రారంభం నుంచే పర్యవేక్షించాలని జిల్లా ఉన్నతాధికారులకు ప్రభుత్వం ఆదేశించింది. మారిన మెనూ పాఠశాలల పునఃప్రారంభమైన గురువారం నుంచే అమల్లోకి వచ్చింది. ప్రభుత్వం ఇచ్చిన మెనూ ప్రతిరోజు మారే విధంగా చర్యలు తీసుకుంటున్నారు. ఉదాహరణకు ఉదయం అల్పాహారం కింద సోమవారం ఉప్మా పెడితే మరుసటి రోజు ఇతర వంటకాల్లో ఏదైనా ఒక దాన్ని వడ్డిస్తారు. ఇలా రోజూ ఉదయం, మధ్యాహ్నం, సాయంత్రం, రాత్రి వివిధ రకాల రుచులతో వంటకాలు అందిస్తారు. కొత్తగా రూపొందించిన ఆహార పట్టిక విద్యాలయాల్లో నోటీసు బోర్డుపై పెట్టి విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్నారు. అలాగే బాలికల తల్లిదండ్రులకు కూడా దీనిపై అవగాహన కల్పించనున్నారు.

**● జిల్లాలో 15 స్కూళ్లు..**

కుమరం భీం ఆసిఫాబాద్ జిల్లాలో మొత్తం 15కస్తూర్బా విద్యాలయాలు ఉన్నాయి. జిల్లాల విభజన తర్వాత కొత్తగా ఏర్పాటైన మండలాల్లోనూ కేజీబీవీలను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. జిల్లావ్యాప్తంగా సుమారు నాలుగు వేలకు పైగా విద్యార్థులు వివిధ పాఠశాలల్లో చదువుతున్నారు. ప్రస్తుతం కొత్త విద్యార్థుల ప్రవేశాలు కొనసాగుతున్నందున ప్రవేశాల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని అధికారులు భావిస్తున్నారు. కస్తూర్బా విద్యాలయాల్లో ప్రతి ఏటా ప్రవేశాల సంఖ్య పెరుగుతూ వస్తుంది.

**● వేతనాల పెంపు ఏది?**

రాష్ట్ర ప్రభుత్వం కస్తూర్బా పాఠశాలల్లో కొత్త మెనూ అమలు చేయడం వరకు బాగానే ఉన్నా ఆయా పాఠశాలల్లో వంట చేస్తున్న వారికి వేతనాల పెంపుపై ప్రభుత్వం ఎలాంటి ప్రకటన చేయలేదని వంట కార్మికులు వాపోతున్నారు. జిల్లాలోని ఒక్కో పాఠశాలలో సుమారు నాలుగు, నుంచి ఐదుగురు వంట మనుషులు పని చేస్తున్నారు. వారికి ఒక్కొక్కరికి నెలకు 9,500 రూపయాలు చెల్లిస్తున్నారు. ఈ వేతనం తమ కుటుంబ పోషణకు ఏ మాత్రం సరిపోవడం లేదని వాపోతున్నారు. దీనికితోడు కేజీబీవీల్లో కొత్త మెనూ అమలుతో తమకు మరింత భారం పెరిగిందని వాపోతున్నారు. ఇప్పటికే ఉదయం నుంచి రాత్రి వరకు పాఠశాలల్లో పని చేస్తున్నామని కొత్తగా అమల్లోకి తెచ్చిన మెనూతో మరింత భారంగా మారనుందని వంట మనుషులు వాపోతున్నారు. పనికి తగ్గ వేతనం కింద తమకు నెలకు 19,000 రూపాయలు ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు. దీనిపై ప్రభుత్వం ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందో చూడాలి.

**● మెనూ ఇలా....**

**ఉదయం:** ఉప్మా, జీరా రైస్, పులిహోరా, టమాట కిచిడీ, రాగి జావ, సాంబారు. బూస్టు, పూరి, బోండా, వడ, చపాతి, అరటి పండు
**మధ్యాహ్నం:** టమాట పప్పుతో అన్నం, నెయ్యి, రసం, పెరుగు, ఉడకబెట్టిన గుడ్డు, చికెన్
**సాయంత్రం:** పకోడి, ఉడకబెట్టిన శనగలు, ఎగ్‌బజ్జీ, బెల్లంపట్టీలు, అల్లం చాయ్, మిల్లెట్ బిస్కెట్లు
**రాత్రివేళ:** వివిధ రకాల కూరలతో అన్నం, మజ్జిగ, సాంబారు

**పకడ్బందీగా అమలుకు చర్యలు..**
**- భాగ్యలక్ష్మి, జీఈసీవో, ఆసిఫాబాద్**



రాష్ట్ర ప్రభుత్వం కస్తూర్బా విద్యాలయాల్లో కొత్త మెనూ అమలుకు చర్యలు తీసుకుంది. బాలికలకు పౌష్టికాహారం అందించేందుకు రూపొందించిన మెనూ అన్ని పాఠశాలల్లో పకడ్బందీగా అమలు చేసేందుకు చర్యలు తీసుకుంటాం. విద్యార్థుల చదువుతో పాటు మెరుగైన భోజనం అందించేందుకు ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. పాఠశాలలు పునఃప్రారంభమైన గురువారం నుంచే కొత్త మెనూ అమలు చేపడుతున్నాం.

## రాజీమార్గమే రాజమార్గం

**- జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎంవీ రమేష్**

ఆసిఫాబాద్, జూన్ 14(ఆంధ్రజ్యోతి): రాజీమార్గమే రాజ మార్గమని జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎంవీ రమేష్ అన్నారు. శనివారం ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలోని కోర్టు ఆవరణలో నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌లో పాల్గొని రాజీమార్గం ద్వారా కేసులను పరిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లోక్ అదాలత్‌ల ద్వారానే సత్వర న్యాయం లభిస్తుందన్నారు. కేసులను రాజీ చేసుకోవడం ద్వారా ఇరువర్గాల సమయంతో పాటు డబ్బులను కూడా ఆదా చేసుకోవచ్చని తెలిపారు. ఈ సందర్భంగా కక్షిదారులు రాజీపడదగ్గ క్రిమినల్, సివిల్, తదితర కేసులను రాజీమార్గం ద్వారా పరిష్కరించారు. జిల్లాలో లోక్‌అదాలత్ ద్వారా మొత్తం 3,604 కేసులు పరిష్కరించి, 32,27,050 రూపాయలు జరిమానాలు విధించారు. లోక్‌అదాలత్‌లో సీనియర్ సివిల్ జడ్జి యువరాజ, జూనియ ర్ సివిల్ జడ్జి అనంతలక్ష్మి, న్యాయవాదులు, కోర్టు సిబ్బంది, పోలీసు అధికారులు పాల్గొన్నారు.

**● లోక్ అదాలత్‌లో కేసుల సత్వర పరిష్కారం**



లోక్ అదాలత్‌లో పాల్గొన్న న్యాయమూర్తి అజయ్ ఉల్లం

సిర్పూర్(టి), జూన్ 14 (ఆంధ్రజ్యోతి): జాతీయ లోక్‌అదాలత్ ద్వారా కేసులు సత్వర పరిష్కారం అవుతాయని సిర్పూర్(టి) జూనియర్ సివిల్ జడ్జి అజయ్ ఉల్లం అన్నారు. శనివారం కోర్టు హాల్‌లో జాతీయ లోక్ అదాలత్ నిర్వహించారు. లోక్ అదాలత్ రాజీమార్గంలో పరిష్కారం అయిన కేసులు మళ్లీ అప్పీల్‌కు పోయే అవకాశం ఉండదన్నారు. అనంతరం చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ లోక్ అదాలత్‌లో 876 కేసులను రాజీమార్గంలో పరిష్కరించి రూ.19,58,800 జరిమానా విధించారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు కళ్యాణ్, మతీన్, కోర్టు సిబ్బంది ఉన్నారు.

## అవినీతిని బహిర్గతం చేయాల్సిన బాధ్యత మీడియాదే

**-ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్ బాబు**

కాగజ్‌నగర్ టౌన్, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): సమాజంలో అవినీతిని బహిర్గతం చేయాల్సిన బాధ్యత మీడియాదేనని సిర్పూర్ ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్ రావు అన్నారు. శనివారం స్థానికంగా ఓ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన తెలగాణ వర్కింగ్ జర్నలిస్టు ఫెడరేషన్ ద్వితీయ మహాసభలో ఆయన ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వెనుకబడిన కుమరం భీం ఆసిఫాబాద్ జిల్లాలో అవినీతిపాలన విచ్చలవిడిగా కొనసాగుతోందన్నారు. జిల్లా స్థాయి అధికారుల నుంచి మొదలుకొని మండల, గ్రామ స్థాయి అధికారుల వరకు కూడా అవినీతి కొనసాగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రస్థాయిలో మంత్రులు కూడా కేవలం తమ నియోజకవర్గాలకే పరిమితం అవుతున్నారన్నారు. ఇతర నియోజకవర్గాల అభివృద్ధిని విస్మరించడం, అవినీతిని బహిర్గతం చేసి ప్రజలను చైతన్యవంతులను చేయాల్సిన బాధ్యత మీడియాపై ఉందన్నారు. సమావేశంలో టీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బసవ పున్నయ్య, కార్యదర్శి చంద్రశేఖర్, జిల్లా అధ్యక్షుడు సురేందర్ రావు, రాజశేఖర్, మహేశ్, నాగేందర్, సతీష్, సంతోష్, విష్ణు, లలిత్, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.



## ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలు అందజేత

లింగాపూర్ జూన్ 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మామిడిపల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని నడ్డంగూడా గ్రామంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు జాధవ్ లోకేందర్ ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలను లబ్ధిదారులకు శనివారం అందజేశారు. ఈ సందర్భంగా అయన మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం నిరుపేదల సొంతింటి కల నెరవేరుస్తోందన్నారు. ఇచ్చిన మాట ప్రకారం ఇళ్ల మంజూరు పత్రాలు ఇస్తున్నామని తెలిపారు. లబ్ధిదారులు మధ్యవర్తులను నమ్మవద్దని సూచించారు. కార్యక్రమంలో లింగాపూర్ మాజీ ఎంపీటీసీ సోభాబలిరాం, గ్రామపంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

## సబ్సిడీ విత్తనాలు ఇవ్వాలి

జైనూర్, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): కొలాం రైతులకు వంద శాతం సబ్సిడీ పైన ప్రభుత్వం విత్తనాలు పంపిణీ చేయాలని కొలాం సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఆత్రం రాజు కోరారు. మండల కేంద్రంలో శనివారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రైతు భరోసా ఇవ్వడంలో ఆలస్యం అవుతుండడంతో కొలాం రైతులు ఆర్థిక పరిస్థితుల కారణంగా విత్తనాలు కొనుగోలు చేయలేకపోతున్నారని ఆయన పేర్కొన్నారు. ఇంతకు ముందు ఐటీడీఏ ద్వారా ప్రత్యేకంగా కొలాంలకు అన్ని రకాల విత్తనాలు వందశాతం సబ్సిడీపై ఇస్తుండేవారని గుర్తు చేశారు. కొద్ది సంవత్సరాల నుంచి ఇవ్వక పోవడంతో కొలాం రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుతం భూముల్లో దుక్కిలు పూర్తయ్యాయని, వర్షాలు అనుకూలంగా ఉన్నదున విత్తనాలు నాటేందుకు సిద్ధమవుతుండగా డబ్బులు లేనందున విత్తనాలు కొనుగోలు చేయలేకపోతున్నామని వాపోయారు. సంబంధిత అధికారులు స్పందించి ఉచితంగా పత్తి, సోయా, కంది, పెసర్లు, మినుములు తదితర విత్తనాలు పంపిణీ చేయాలని ఆయన కోరారు. సంఘం నాయకులు సిడం ముత్త, సిడాం భీంరావ్, ఆత్రం గుండా, ఆత్రం పోచిరాం తదితరులు పాల్గొన్నారు.

# సీపీఆర్‌పై ప్రతీ ఒక్కరు అవగాహన కలిగి ఉండాలి




వాంకిడిలో సీపీఆర్‌పై అవగాహన కల్పిస్తున్న పోలీసులు, కెరమెరిలో క్రీడా కిట్లను అందజేస్తున్న ఎస్సై మధుకర్

వాంకిడి, జూన్ 14(ఆంధ్రజ్యోతి): సీపీఆర్‌పై ప్రతి ఒక్కరికి అవగాహన కలిగి ఉండాలని ఎస్సై ప్రశాంత్ పేర్కొన్నారు. శనివారం వాంకిడి మండలంలోని సామె గ్రామంలో ఆసిఫాబాద్ జిల్లా ఎస్పీ పాటిల్ కాంతిలాల్ సుభాష్ ఆదేశాల మేరకు వాంకిడి పోలీసు శాఖ ఆధ్వర్యంలో గ్రామస్థులకు సీపీఆర్‌పై అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా వాంకిడి ఎస్సై ప్రశాంత్ మాట్లాడుతూ గుండెపోటు వచ్చిన వ్యక్తికి తక్షణమే ప్రథమ చికిత్స అందించడం వల్ల ప్రాణాలు కాపాడవచ్చని పేర్కొన్నారు. ఆకస్మికంగా గుండెపోటుతో కుప్పకూలితే వెంటనే 108 అంబులెన్స్‌కు సమాచారం ఇచ్చి వాహనం వచ్చే వరకు సీపీఆర్ చేస్తే నిండు జీవితాన్ని కాపాడిన వారమవుతామన్నారు. సీపీఆర్ చేసే విధానంపై పోలీసులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది ఉన్నారు.

**కెరమెరి (ఆంధ్రజ్యోతి):** మండలంలోని మారు మూల గ్రామమైన లక్మాపూర్‌లో కెరమెరి ఎస్సై మధుకర్ ఆధ్వర్యంలో సీపీఆర్‌పై అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అత్యవసర వేళల్లో అనుసరించాల్సిన విధానాలపై గ్రామస్థులకు యువకులకు అవగాహన కల్పించారు. సైబర్ క్రైంల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. అపరిచిత వ్యక్తులు బ్యాంకు వివరాలు అడిగితే తెలిపరాదన్నారు. అలాగే గ్రామాల్లో కొత్త వ్యక్తులు సంచరించినట్లయితే తమకు సమాచారం అందించాలన్నారు. యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండి సన్మార్గంలో నడవాలన్నారు. కార్యక్రమంలో పోలీసుసిబ్బంది పాల్గొన్నారు.

### గంజాయి రహిత సమాజాన్ని నిర్మిదాం

**లింగాపూర్ (ఆంధ్రజ్యోతి):** గంజాయి రహిత సమాజాన్ని నిర్మిద్ధామని జైనూర్ సర్కిల్ సీఐ రమేష్ అన్నారు. శుక్రవారం రాత్రి కొత్తపల్లిలో గ్రామ ప్రజలకు గంజాయి, గుడుంబా, నకలీ విత్తనాలతో జాగ్రత్తలు, సైబర్ క్రైం తదితర అంశాలపై ప్రజలను అవగాహన కార్యక్రమాన్ని పోలీసు కళా బృందంతో కలిసి నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడారు. గ్రామాల్లో రైతులందరు విత్తనాలు విత్తే సమయమని, నకిలీ విత్తనాలతో జాగ్రత్తలు వహించాలని సూచించారు. లైసెన్స్‌లు ఉన్న దుకాణాల్లోనే విత్తనాలు కొనుగోలు చేయాలన్నారు. గంజాయి రహిత సమాజం కోసం అందరూ చేయాలని అన్నారు. రైతులు దళారుల మాటలువిని చేన్లలో గంజాయి మొక్కలను పెట్టవద్దని సూచించారు. యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండి మంచి భవిష్యతు కోసం కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో లింగాపూర్ ఎస్సై గంగన్న, ఆసిఫాబాద్ కళాబృందం సభ్యులు, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

# మధ్యాహ్నం ఎండ.. సాయంత్రం భారీ వర్షం


కాగజ్‌నగర్‌లో కురుస్తున్న వర్షం

ఆసిఫాబాద్, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): కుమరం భీం ఆసిఫాబాద్ జిల్లాలో శనివారం భారీ వర్షం కురిసింది. ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంతో పాటు కాగజ్‌నగర్, వాంకిడి మండలాల్లో మధ్యాహ్నం వరకు వాతావరణం ఎండ వేడిమితో ఉక్కపోతగా ఉండగా సాయంత్రం ఒక్కసారిగా ఆకాశం మేఘావృతమై ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసింది. దీంతో వాతావరణం చల్లగా మారడంతో ప్రజలు ఉక్కపోత నుంచి ఉపశమనం పొందారు. విద్యుత్ సరఫరాలో అం తరాయం ఏర్పడడంతో ప్రజలు ఇబ్బందులకు గురయ్యారు.

**కాగజ్‌నగర్ టౌన్:** కాగజ్‌నగర్ పట్టణం, మండలంలో శనివారం ఉరుములు, మెరుపులతో భారీ వర్షం కురిసింది. దీంతో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. పలు తోతట్టు ప్రాంతాలు జలమయ్యాయి. పలు కాలనీల్లోకి నీరు చేరింది. సుమారు గంట పాటు భారీ వర్షం కురియడంతో ప్రజలు తీవ్ర అవస్థలు పడ్డారు.

## రైతు భరోసా విడుదల చేయాలి

జైనూర్, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): వానాకాలం సాగు ప్రారంభమైన నేపథ్యంలో విత్తనాలు, ఎరువులు, మందుల కొనుగోలు కోసం తక్షణమే రైతు భరోసా మంజూరు చేయాలని గిరిజన రైతులు కోరారు. ఈ మేరకు శనివారం స్థానిక మండల తహసీల్దార్ కార్యాలయానికి మండలంలోని పట్నాపూర్, గూడామామడ, మాన్కుగూడ, అడ్డెసర్, జంగాం, జండాగూడ తదితర గ్రామాల రైతులు రైతు భరోసా మంజురు చేయాలని అధికారులకు విన్నవించేందుకు తరలి వచ్చారు. రెండో శనివారం కార్యాలయాలకు సెలవు ఉన్నందున వారు నిరాశతో ఇంటిదారి పట్టారు. ఈ సందర్భంగా రైతులతో ఆంధ్రజ్యోతి పలకరించింది. వర్షాలు అనుకూలంగా పడుతున్నాయని, చేతిలో చిల్లి గవ్వ లేనందున ప్రభుత్వం ఇస్తున్న రైతు భరోసాపై ఆధార పడుతున్నామని వారు ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం సకాలంలో రైతు భరోసా అందించకపోవడంతో ఇబ్బందులు పడుతున్నామని వాపోయారు. ఇప్పటికైనా ప్రభుత్వం తమ బాధల్ని అర్థం చేసుకొని వెంటనే రైతు భరోసా నిధులు విడుదల చేయాలని ఆయా గ్రామాల రైతులు కోరుతున్నారు.



# అక్రమ కేసులు పెట్టడం అన్యాయం


జైలు వద్ద ఆదిలాబాద్ ఎంపీ గోడెం నగేష్, బీజేపీ నాయకులు

కాగజ్‌నగర్, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): కాగజ్‌నగర్ పట్టణానికి చెందిన హిందూ బాంధవులు శివ గౌడ్, అరుణ్ లోయా, విజయ్‌కుమార్‌తో పాటు తదితరులను ఆదిలాబాద్ ఎంపీ ఎంపీ గోడెం నగేష్, బీజేపీ నాయకులు శనివారం ఆదిలాబాద్ జైలులో ములాఖత్ అయ్యారు. గోవులను తరలింపు అడ్డుకున్న కేసులో వారం రోజుల క్రితం అరెస్టు చేశారు. వీరందరిని ఆదిలాబాద్ జైలుకు రిమాండుకు తరలించారు. ఈ సందర్భంగా ఆదిలాబాద్ ఎంపీ గోడెం నగేష్, కాగజ్‌నగర్ పట్టణ అధ్యక్షుడు ఆర్మీ శివకుమార్, మాజీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ కొత్తపల్లి శ్రీనివాస్, కొంగ సత్యనారాయణతో పాటు పలువురు కలిశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసి న సమావేశంలో పలువురు మాట్లాడుతూ మూగజీవాల అక్రమ రవాణాను అడ్డుకున్న హిం దూ బాంధవులపై అక్రమ కేసులు పెట్టి తరలించటం అన్యాయమని పేర్కొన్నారు. కార్యక్రమంలో దెబ్బటి శ్రీనివాస్, కార్తిక్, వేణు, అంగల సంతోష్, రాజు, శివగుప్తా, తిరుపతిగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ

పెంచికలపేట, జూన్ 14(ఆంధ్రజ్యోతి): మండలంలో పలువురికి మంజూరైన సీఎంఆర్‌ఎఫ్ చెక్కును ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌రావు ఆదేశాల మేరకు బాధిత కుటుంబాలకు నాయకులు చెక్కులను శనివారం అందజేశారు. ఆగర్‌గూడ గ్రామానికి చెందిన కామెర బాబాజీకి రూ.60 వేలు, ఎల్కపల్లి గ్రామానికి చెందిన రాచకొండ మమతకు రూ.42 వేలు, జునగరి సుగుణకు రూ.7,500 చెక్కులను అందజేశారు. నాయకులు మదుకర్, సత్యనారాయణ, నాగ న్న, ప్రభాకర్, రాజన్న, బాపూజీ, సంతోష్, కిషన్, కమలాకర్, భాస్కర్, మహేష్, రాజన్న, వెంకన్నలు పాల్గొన్నారు.


చెక్కులు పంపిణీ చేస్తున్న బీజేపీ నాయకులు